ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



వికారాబాద్ - మేడ్చల్

జిల్లాల వార్తలు

5

శుక్రవారం 27 సెప్టెంబరు 2024



పరిగిలో మెడకు ఉరితాళ్లతో నిరసన వ్యక్తం చేస్తున్న కాంట్రాక్టర్లు

ఉరితాళ్లతో నిరసన

మనఊరు-మన బడి పనులకు రాని బిల్లులు

ఆందోళనలో కాంట్రాక్టర్లు

పరిగి, సెప్టెంబరు 26: మనఊరు-మన బడి కార్యక్రమం కింద చేపట్టిన పనులకు బిల్లులు ఇవ్వకపోవడాన్ని నిరసిస్తూ కాంట్రాక్టర్లు గురువారం పరిగిలో మెడకు ఉరితాళ్లు వేసుకుని నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఆర్టీసీ బస్టాండ్ వరకు ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించారు. నిరసనను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కాంట్రాక్టర్ల సంఘం నాయకులు రాఘవేందర్‌గౌడ్, రవిచంద్రలు మాట్లాడుతూ మన ఊరు-మన బడి కింద పనులు చేపట్టి ఏడాదిన్నర గడిచినా ఇప్పటి వరకు బిల్లులు ఇవ్వకపోవడం ఏమిటని ప్రశ్నించారు. లక్షలు అప్పులు తీసుకొచ్చి పనులు చేపడితే అధికారులు బిల్లులు ఇవ్వడంలో ఇబ్బందులకు గురి చేస్తున్నారని విమర్శించారు. నెలనెలా వడ్డీ భారంతో ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి ఏర్పడిందన్నారు. గత ప్రభుత్వంలో చేపట్టిన పనులకు మా ప్రభుత్వంలో ఎలా బిల్లులు ఇస్తారని కొందరు నాయకులు అంటున్నారని, ఇదెక్కడి న్యాయమని ప్రశ్నించారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ద్వారా చేపట్టిన పనులు బిల్లులు ఇచ్చి, మన ఊరు-మన బడి కింద చేపట్టిన పనులకు ఇవ్వకపోవడంపై ఆగ్రహం వక్తం చేశారు. కార్యక్రమంలో వివిధ గ్రామాలకు చెందిన కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.



చాకలి ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధికారులు

పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ

అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

వికారాబాద్, సెప్టెంబరు 26 : చాకలి ఐలమ్మ గొప్ప పోరాట యోధురాలని, ఆమె ఆశయాలను స్ఫూర్తిగా తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో ఐలమ్మ జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ సాయుధ ఉద్యమంలో వీరనారి ఐలమ్మ ముఖ్య భూమిక పోషించారని, త్యాగాన్ని భావి తరాలకు అందించి ఉద్యమ స్ఫూర్తిని రగిల్చారని కొనియాడారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సుధీర్, బీసీ సంక్షేమ అధికారి ఉపేందర్, వ్యవసాయాధికారి మోహన్‌రెడ్డి, సివిల్ సప్లయ్ అధికారి మోహన్‌బాబు, ఈఈ పీఆర్ ఉమేష్ కుమార్, డీపీఆర్వో చెన్నమ్మ, కలెక్టరేట్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అనంతగిరి కొండల్లో పర్యాటకుల సందడి, (ఇన్‌సెట్‌లో) కనువిందు చేస్తున్న జలపాతం





అనంతగిరి కొండల అందాలను కెమెరాలో బంధిస్తున్న యువతి

మారుతున్న జీవనశైలిలో మనుషులు కొత్తగా ఆలోచిస్తూ పర్యాటక ప్రదేశాలకు పరుగులు తీస్తున్నారు. కరోనా లాంటి విపత్తు తర్వాత ఉన్నంతకాలం సంతోషంగా జీవించాలనే ఆలోచనతో చుట్టపక్కల ఉన్న పర్యాటక ప్రాంతాలను చూసేందుకు బారులు దీరుతున్నారు. నేడు ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా ఉమ్మడి జిల్లాలోని అనంతగిరి కొండలు, కోట్‌పల్లి, సర్పన్‌పల్లి ప్రాజెక్టు, హిమాయత్‌సాగర్, గండిపేట జలాశయం, శామీర్‌పేట చెరువు తదితర పర్యాటక ప్రదేశాలపై ప్రత్యేక కథనం.

నేడు ప్రపంచ పర్యాటక దినం

అనంతగిరి.. పర్యాటక సిరి

తెలంగాణ ఊటీగా అనంతగిరి కొండలకు గుర్తింపు

పర్యాటకులతో అలరారుతున్న పర్యాటక ప్రదేశాలు

ఆధ్యాత్మిక క్షేత్రాలకు నిలయంగా ఉమ్మడి జిల్లా

కరోనా తర్వాత మారిన ప్రజల జీవన శైలి

పర్యాటక ప్రాంతాలకు ప్రజల పరుగులు

వికారాబాద్, సెప్టెంబరు 26: చుట్టూ ఎత్తైన కొండలు.. పచ్చని చెట్లు.. మలుపులు తిరిగే ఘాట్ రోడ్డు, చూడగానే మైమరిపించే ప్రకృతి సౌందర్యం.. వీక్షించి ఆస్వాదించాల్సిందే అనిపించే ఆహ్లాదకరమైన వాతావరణం అనంతగిరి కొండల సొంతం.. ప్రకృతి రమణీయతకు మారుపేరుగా చెప్పుకునే ఈ ప్రాంతం తెలంగాణ ఊటీగా గుర్తింపుపొందింది. ఈ సహజసిద్ధమైన కొండలు ఇక్కడకు వచ్చే భక్తులకు, సందర్శకులకు ఆధ్యాత్మికం, ఆహ్లాదంతో పాటు ఆరోగ్యాన్ని పంచుతున్నాయి. ప్రకృతి సౌందర్యంతో అలరారుతున్న అనంతగిరి కొండలకు త్వరలో మహర్దశ పట్టనుంది. కేంద్ర పర్యాటక శాఖ స్వదేశీ దర్శన్ 2.0 పథకం కింద ఇక్కడ ఎకో టూరిజం జోన్‌గా అభివృద్ధి పరిచే పనులు త్వరలో ప్రారంభంకానున్నాయి.



రోజుకు 3వేల నుంచి 5వేల మంది పర్యాటకుల రాక

అనంతగిరి కొండల్లో 213 ఎకరాల్లో రూ.98 కోట్ల నిధులతో ఎకో టూరిజం జోన్‌గా తీర్చిదిద్దనున్నారు. కాటేజీలు, హోటళ్లు, కన్వెన్షన్ సెంటర్, రోడ్లు, పార్కింగ్, ట్రాకింగ్ పాయింట్, తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు వంటి సదుపాయాలు కల్పించనున్నారు. వీటితో పాటు సమీపంలోని కోట్‌పల్లి, సర్పన్‌పల్లి ప్రాజెక్టులను పర్యావరణ పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దనున్నారు. అనంతగిరి కొండలు రాష్ట్ర రాజధానికి అత్యంత సమీపంలో ఉండడంతో పర్యాటకుల తాకిడి అధికంగా ఉంటుంది. వారాంతాల్లో సుమారు 3వేల నుంచి 5వేల మంది వరకు పర్యాటకులు వస్తుంటారు. వర్షాకాలంలో పర్యాటకుల తాడికి మరింత ఎక్కువగా ఉంటుంది. ఇక్కడి అడవుల్లో అపారమైన ప్రకృతి సంపద, ఔషధ మొక్కలు ఉన్నాయి. వన్యప్రాణులు, వందల రకాల పక్షులున్నాయి. ఈ ప్రాంతంలో

మిగతా 6వ పేజీలో...

అనంతగిరి కొండలను అడ్వెంచర్ (సాహసకృత్యాలు) టూరిజం కేంద్రంగా అభివృద్ధి పరచే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయి. వన్యప్రాణుల సంరక్షణతో పాటు ఇక్కడకు వచ్చే పర్యాటకులకు ఆహ్లాదం పంచేందుకు జంగిల్ రిసార్ట్‌తో పాటు ఎడ్వంచర్ టూరిజం అభివృద్ధి పరిచేలా చర్యలు తీసుకోవాల్సి ఉంది. సింగపూర్, మలేషియా దేశాల్లో మాదిరిగా ఈ ప్రాంతంలో జంగిల్ రిసార్ట్ ఏర్పాటు చేయాలనే ప్రతిపాదన ఉంది. మౌంటెన్ క్లైంబింగ్, రాక్ క్లైంబింగ్, డిర్ట్ బైక్స్, సైకిల్ ట్రాప్, జిప్‌లైన్స్, నేచర్ ట్రెక్కింగ్, స్కై డైవింగ్,

అడ్వెంచర్స్‌కు కేంద్రం

బ్యాక్ బ్యాకింగ్, క్యాంపింగ్, హైకింగ్, హార్స్ బ్యాక్ రైడింగ్, స్కూబా డైవింగ్, బర్డ్ వాచింగ్, ఎకో టూరిజం, కెనోయింగ్, రివర్ క్రాసింగ్, అడ్వెంచర్ క్లబ్ వంటివి ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనలు కార్యరూపం దాలిస్తే అనంతగిరి రాష్ట్రంలో ప్రముఖ పర్యాటక కేంద్రంగా మారే అవకాశం ఉంది.

ట్రెక్కింగ్ చేస్తున్న పర్యాటకులు





హైడ్రా అధికారులు పరిశీలించిన నారాయణ చెరువు

గుండ్లపోచంపల్లిలో హైడ్రా అధికారుల పర్యటన

రెండు చెరువుల్లో అక్రమ కట్టడాలను గుర్తించినట్టు సమాచారం

మేడ్చల్ టౌన్, సెప్టెంబరు 26 : గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని రెండు చెరువులను హైడ్రా అధికారుల బృందం గురువారం పర్యటించింది. కబ్జాలకు గురైనట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న నారాయణ, సుమారు చెరువు పరిసరాలను, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లను వారు పరిశీలించారు. నారాయణ చెరువు పరిసరాల్లో పాత, కొత్త నిర్మాణాలు పెద్దగా ఉండటంతో పాటు, నిర్మాణంలో ఉన్న కట్టడాల ఫొటోలను తీసుకున్నారు. చెరువు బఫర్ జోన్‌లో నిర్మించిన కట్టడాల గురించి ఆరా తీశారు. బఫర్ జోన్‌లలోని నిర్మాణాలను హైడ్రా బృందం గుర్తించింది. చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లలో ఉన్న నిర్మాణాలను, ఇతర కట్టడాలను వెంటనే గుర్తింపూర్తి వివరాలు తమకు సమర్పించాలని హైడ్రా స్థానిక అధికారులకు సూచించింది. అయితే, హైడ్రా బృందం సభ్యులు స్థానిక అధికారులకు ఎలాంటి సమాచారం లేకుండానే ఇక్కడకు వచ్చింది. వారు ఇక్కడకు వచ్చిన అనంతరం స్థానిక అధికారులను పిలిపించుకున్నారు.



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ సుధీర్

ఓపెన్ ఇంటర్, టెన్త్ పరీక్షలకు ఏర్పాట్లు చేయాలి

అదనపు కలెక్టర్ సుధీర్

వికారాబాద్, సెప్టెంబరు 26 : అక్టోబర్ 3 నుండి 9 వరకు ఓపెన్ ఇంటర్, టెన్త్ పరీక్షలు నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్ అధికారులకు ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో విద్యాశాఖ అధికారులతో పరీక్షల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో రెండు పరీక్ష సెంటర్లు ఏర్పాటు చేశామని తెలిపారు. పదో తరగతి పరీక్ష వికారాబాద్‌లోని బాలుర జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 166 మంది, ఇంటర్ పరీక్షకు వికారాబాద్ బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 150 మంది పరీక్ష రాసేలా ఏర్పాట్లు చేశామన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్ సదుపాయం ఏర్పాటు చేయాలన్నారు. సెంటర్ల దగ్గరలో ఉన్న జిరాక్స్ సెంటర్లను మూసి వేయించాలన్నారు. పరీక్షలో ఎలాంటి కాపీయింగ్ జరుగకుండా బందోబస్తు చర్యలు తీసుకోవాలన్నారు. పరీక్షల నిర్వహణకు సూపరింటెండెంట్లు, ఇన్విజిలేటర్లు శిక్షణ ఏర్పాటు చేయాలన్నారు. అభ్యర్థులను పరీక్షా కేంద్రాలకు చేరవేసేందుకు ఆర్టీసీ బస్సులు సిద్ధంగా ఉంచాలని అదనపు కలెక్టర్ చెప్పారు. అభ్యర్థులు వారి హాల్ టికెట్లు ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. పరీక్షలు పూర్తయ్యే వరకు గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు. సమావేశంలో డీఈవో రేణుకాదేవి, విద్యుత్ ఎస్ఈ సంజీవరెడ్డి, ఆర్టీసీ డీఎం అరుణ, ఎస్ఐ అబ్దుల్ హఫీజ్, తదితరులు పాల్గొన్నారు.

సర్దుబాటు సందిగ్ధం!

ఉపాధ్యాయుల రేషనలైజేషన్ ముందుకు సాగేనా?

- ప్రతిపాదనలు పంపించాలని ఎంఈవోలకు ఆదేశం
- ఈ ప్రక్రియ కొలిక్కి రావడానికి వారం రోజులు పట్టే అవకాశం

వికారాబాద్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులను తాత్కాలికంగా సర్దుబాటు చేసే ప్రక్రియ ఏ మేరకు ముందుకు సాగనుందనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. విద్యార్థులు అధికంగా ఉన్న పాఠశాలల్లో తక్కువ సంఖ్యలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తక్కువ సంఖ్యలో ఉంటే ఎక్కువ సంఖ్యలో ఉపాధ్యాయులు కొనసాగుతున్నారు. విద్యార్థులు ఎక్కువగా ఉండి ఒకరిద్దరు ఉపాధ్యాయులు ఉన్నచోట విద్యా బోధనలో ఇబ్బందులు ఎదురవుతుండగా, విద్యార్థులు తక్కువగా ఉండి ఉపాధ్యాయులు ఎక్కువ మంది ఉన్న పాఠశాలల్లో ఉన్నవారికి పని లేకుండా పోయిందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. తక్కువ మంది విద్యార్థులు ఉండి ఉపాధ్యాయులు ఎక్కువగా ఉంటే వారిలో ఒకరిద్దరిని అదే మండలంలో ఉపాధ్యాయులు తక్కువగా ఉన్న పాఠశాలలకు సర్దుబాటు చేస్తూ వచ్చారు. ఉపాధ్యాయులను తాత్కాలికంగా ఒక పాఠశాల నుంచి మరో పాఠశాలకు సర్దుబాటు చేసే విషయంలో జిల్లాస్థాయిలో నిర్ణయాలు తీసుకునే వారు. మండల పరిధిలో ఏ పాఠశాలలో విద్యార్థులు తక్కువగా ఉండి ఉపాధ్యాయులు ఎక్కువ మంది ఉన్నారు... ఏ పాఠశాలలో విద్యార్థులు ఎక్కువగా ఉండి.. ఉపాధ్యాయులు తక్కువగా ఉన్నారనే విషయమై మండలాల నుంచి నివేదికలు తెప్పించుకుని కలెక్టర్ అనుమతితో ఉపాధ్యాయులను సర్దుబాటు చేస్తూ వచ్చారు. అయితే కొన్నిచోట్ల సర్దుబాటు చేసిన ఉపాధ్యాయుల్లో కొందరు తమకు తాత్కాలికంగా కేటాయించిన కొత్త పాఠశాలల్లో విధులు నిర్వర్తించేందుకు ససేమిరా అంటుండడంతో సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. తమకు అనుకూలంగా ఉన్న పాఠశాలలకు వెళ్లడానికి ఆసక్తి కనబరుస్తుండగా, దూరంగా ఉండి, ఇబ్బందిగా భావించే పాఠశాలలకు మాత్రం వెళ్లడానికి నిరాకరిస్తున్నారు. సర్దుబాటు ఆదేశాలను పాటించాల్సిందేనని విద్యాశాఖ అధికారులు చెబుతున్నా రాజకీయ, సంఘాల నేతల పలుకుబడి ఉపయోగించి తాము కొనసాగుతున్న పాఠశాలల్లోనే కొనసాగే విధంగా ఇదివరకు ప్రయత్నాలు చేసుకున్న సంఘటనలూ ఉన్నాయి. ఇలాంటి ఘటనలను పరిగణనలోకి తీసుకున్న విద్యా శాఖ డైరెక్టర్ తాత్కాలికంగా ఉపాధ్యాయుల సర్దుబాటుకు అనుమతిస్తూ ఈ నెల 20న ఉత్తర్వులు జారీ చేశారు. ఉపాధ్యాయులు సరిపడా లేని ప్రభుత్వ పాఠశాలలకు తల్లిదండ్రులు తమ పిల్లలను పంపించడం లేదు. దూరమైనా.. ఆర్థికంగా భారమైనా ప్రైవేట్ పాఠశాలలకు పంపిస్తున్న విషయం తెలిసిందే.

ఆ నాలుగు మండలాల్లోనే?

జిల్లాలో 1068 ప్రభుత్వ, జడ్పీ పాఠశాలలు, 776 ప్రాథమిక, 116 ప్రాథమికోన్నత, 176 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. ఈ పాఠశాలలకు 4,648 ఉపాధ్యాయ పోస్టులు మంజూరయ్యాయి. వాటిలో 3,912 మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా కాకుండా ఎక్కువ మంది ఉపాధ్యాయులు వికారాబాద్, పరిగి, పూడూరు, ధారూరు మండలాల్లో ఉన్నారు. మిగతా మండలాల్లో ఆ పరిస్థితి లేదంటున్నారు. కాగా, ఇటీవల జరిగిన బదిలీల్లో వేరే పాఠశాలకు బదిలీ అయినా ప్రస్తుతం పనిచేస్తున్న పాఠశాలలకు కొత్తగా ఉపాధ్యాయులు రాకపోవడంతో వారు అక్కడే విధులు నిర్వహించాల్సి వస్తోంది. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా రేషనలైజేషన్ నిబంధనలను సవరిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వుల ప్రకారం ప్రాథమిక పాఠశాలల్లో 10మంది లోపు విద్యార్థులు ఉంటే ఒక ఉపాధ్యాయుడు ఉండాలి. 11 నుంచి 60 మంది విద్యార్థులు ఉంటే.. ఇద్దరు ఉపాధ్యాయులు ఉండాలి. ఆ తరువాత ప్రతి 30 మంది విద్యార్థులకు ఒక ఉపాధ్యాయుడు అదనంగా ఉండేలా చర్యలు తీసుకోవాలంటూ ఆ ఆదేశాల్లో స్పష్టం చేశారు. జిల్లాలోని ప్రాథమిక పాఠశాలల్లో ఎక్కువ శాతం 40 నుంచి 60 మధ్యనే విద్యార్థులు ఉన్నారు. ఈ పాఠశాలల్లో ఇద్దరి కంటే ఎక్కువ మంది ఉపాధ్యాయులు ఉంటే వారు ఇతర పాఠశాలలకు సర్దుబాటు కావాల్సిన తప్పని పరిస్థితులు



నెలకొన్నాయి. ఈ విధానం ప్రాథమిక పాఠశాల విద్యా వ్యవస్థను మరింత నిర్వీర్యం చేసే విధంగా ఉందనే అభిప్రాయం ఉపాధ్యాయ సంఘాల నేతల్లో వ్యక్తమవుతోంది. 60 మంది విద్యార్థులకు ఇద్దరు ఉపాధ్యాయులు నాలుగు సబ్జెక్టులు బోధించడం ఎంతో కష్టమని, ఒకవేళ చెప్పినా విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించలేకపోతారనే ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యా బోధన తీరు ఈ విధంగా ఉంటే బోధనేతర పనులు కూడా నిర్వర్తించాల్సి ఉంటుంది. మధ్యాహ్న భోజనం రికార్డులు నిర్వహణ చూసుకోవాల్సి ఉంటుంది. ప్రతీనెల జరిగే కాంప్లెక్స్ సమావేశాలకు హాజరు కావాలి. అదే విధంగా యాప్‌లో విద్యార్థుల హాజరు నమోదు చేయాల్సి ఉంటుంది.

సమస్య పరిష్కారమయ్యేనా!

ఇటీవల రాష్ట్ర విద్యా శాఖ జారీ చేసిన జీవో ప్రకారం ఉపాధ్యాయులను సర్దుబాటు చేస్తే ఉపాధ్యాయులు, విద్యార్థులూ ఇబ్బందులు పడే పరిస్థితులు ఉత్పన్నమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. సర్దుబాటు ఉత్తర్వుల్లో విద్యార్థులు, ఉపాధ్యాయుల నిష్పత్తి సరైన తీరులో లేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. విద్యాశాఖ డైరెక్టర్ జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం 60 మంది విద్యార్థులకు ఇద్దరు ఉపాధ్యాయులు సరిపోతారని స్పష్టం చేస్తుండగా, అంతమంది విద్యార్థులు ఇద్దరు ఉపాధ్యాయులు ఎలా చదువు చెప్పగలుగుతారనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. ఈ నేపథ్యంలోనే సర్దుబాటు ఉత్తర్వులపై ఉపాధ్యాయులు మండిపడుతున్నారు. ప్రాథమిక స్థాయిలో సబ్జెక్టుకు ఒక ఉపాధ్యాయుడు లేదా తరగతికి ఒక ఉపాధ్యాయుడిని నియమించుకునేలా ఉత్తర్వులు జారీ చేసి ఉంటే బాగుండేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో 10 మంది విద్యార్థులు ఉంటే ఒక ఉపాధ్యాయుడు, 11 నుంచి 60 మంది వరకు ఇద్దరు, 61 నుంచి 90 వరకు ముగ్గురు, 91 నుంచి 120 మంది వరకు నలుగురు, 121 నుంచి 150 మంది వరకు అయిదుగురు, 151 నుంచి 200 మంది విద్యార్థులు ఉంటే ఆరుగురు ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలని ఆదేశాలు ఉన్నాయి. అయితే, గ్రామీణ ప్రాంతాల్లో ప్రాథమిక తరగతులను ఒకరిద్దరు ఉపాధ్యాయులతోనే నెట్టుకు వస్తున్నారు. మరీ మారుమూల గ్రామాల్లోనైతే ఒకే ఉపాధ్యాయుడు దిక్కవుతున్నారు. ఫలితంగా విద్యార్థులకు నాణ్యమైన చదువు అందడం లేదు. ప్రాథమిక పాఠశాలల్లో ప్రతి తరగతికి లేదా సబ్జెక్టుకు ఒక ఉపాధ్యాయుడిని ఇవ్వాలని ఎస్జీటీలు చాలాకాలంగా విద్యా శాఖ ఉన్నతాధికారులను కోరుతున్నా ఫలితం లేదు. ప్రాథమిక పాఠశాలల్లో తరగతికి ఒక ఉపాధ్యాయుడితో పాటు ఒక ప్రధానోపాధ్యాయుడిని కేటాయించాలనే డిమాండ్ చాలా కాలంగా ఉంది.

సమాచార సేకరణ ప్రారంభం

జిల్లాలో ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియపై జిల్లా విద్యా శాఖ వివరాలు సేకరిస్తోంది. యూడైస్‌లో నమోదు చేసిన వివరాల ప్రకారం సర్దుబాటు చేయాల్సిన ఉపాధ్యాయుల వివరాలను మండలాల వారీగా సిద్ధం చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారులు ఇది వరకే ఎంఈవోలను ఆదేశించారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా సర్దుబాటు చేయాల్సిన ఉపాధ్యాయుల వివరాలపై కసరత్తు ప్రారంభమైంది. పూర్తి సమాచారం రాగానే కలెక్టర్‌కు నివేదిక అందజేస్తే తదుపరి చర్యలపై ఆయన నిర్ణయం తీసుకోనున్నారు. ఈ ప్రక్రియ ఓ కొలిక్కి వచ్చే వరకు వారం రోజులు పట్టే అవకాశం ఉంది. ఇదిలా ఉంటే కొత్తగా ఉపాధ్యాయుల నియామకం కోసం కసరత్తు కొనసాగుతున్న ఈ సమయంలో సర్దుబాటు ఎంత వరకు సమంజసమనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది.



స్నాతకోత్సవ ఏర్పాట్లను పరిశీలిస్తున్న వివిధ శాఖల అధికారులు, పోలీసులు

రేపు నల్సార్ యూనివర్సిటీ స్నాతకోత్సవం

- వేడుకలకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రాక
- ఏర్పాట్లను పర్యవేక్షించిన అధికారులు

శామీర్‌పేట, సెప్టెంబరు 26 : మేడ్చల్ జిల్లా శామీర్‌పేట పరిధిలోని నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయ 21వ స్నాతకోత్సవాన్ని శనివారం భారీ ఎత్తున నిర్వహిస్తున్నట్లు యూనివర్సిటీ వైస్‌చాన్సలర్ శ్రీక్రిష్ణదేవరావ్ తెలిపారు. ఆయన గురువారం మీడియాతో మాట్లాడుతూ.. ఈ స్నాతకోత్సవ కార్యక్రమానికి ఈ సారి ముఖ్యఅతిథిగా భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము విచ్చేస్తున్నట్లు వెల్లడించారు. అదేవిధంగా గౌరవ అతిథిగా రాష్ట్ర గవర్నర్ శ్రీజిష్ణుదేవ్‌వర్మ, నల్సార్ చాన్స్‌లర్, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అలోక్ ఆరాధే, అలాగే సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నర్సింహులు విచ్చేస్తున్నట్లు వైస్‌చాన్సలర్ వెల్లడించారు. ఈ వార్షికోత్సవం, స్నాతకోత్సవ కార్యక్రమాన్ని మధ్యాహ్నం 12గంటల నుంచి 1.30వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యూనివర్సిటీలో ఎల్‌ఎల్‌ఎం, ఎంబీఏ, బీఎల్‌ఎల్‌బీ, తదితర కోర్సులను విజయవంతంగా పూర్తిచేసుకున్న విద్యార్థులకు డిగ్రీ పట్టాలను, ఉత్తమ, అత్యుత్తమ ర్యాంకులను సాధించిన మెరిట్ విద్యార్థులకు 50 బంగారు పతకాలను ప్రదానం చేయనున్నట్లు వైస్‌చాన్సలర్ వివరించారు.

ఏర్పాట్ల పర్యవేక్షణ

నల్సార్‌లో శనివారం వార్షికోత్సవం, స్నాతకోత్సవ సందర్భంగా గురువారం సంబంధిత ప్రభుత్వ అధికారులు, పోలీసులు సందర్శించి ఏర్పాట్లను పర్యవేక్షించారు. రాష్ట్ర ఇంటెలిజెన్స్ సెక్యూరిటీవింగ్ ఎస్పీ రామకృష్ణ, డీసీపీ కోటిరెడ్డి, ఆర్డీవో ఉపేందర్‌రెడ్డి, తహసీల్దార్ యాదగిరిరెడ్డి, ఆర్ అండ్ బీ, వైద్యశాఖ, విద్యుత్‌శాఖ, పర్యాటక శాఖ, పౌరసంబంధాల శాఖ, అధికారులు నల్సార్‌ను సందర్శించి ఏర్పాట్లను పర్యవేక్షించారు. రోడ్ల మరమ్మతులు, రెడ్ కార్పెట్లు, నిరంతరాయ విద్యుత్, వైద్య శిబిరాలు, అంబులెన్స్, సీటింగ్ తదితర సౌకర్యాల ఏర్పాట్లపై అధికారులు చర్చించి పర్యవేక్షించారు.

అనంతగిరి.. పర్యాటక సిరి

(ఐదో పేజీ తరువాయి)

సినిమా, టీవీ షూటింగ్‌లు జరుగుతుంటాయి. ఇటీవల కోట్‌పల్లి ప్రాజెక్టులో బోటింగ్, కాయకింగ్‌ను కూడా ప్రారంభించారు.

మార్కండేయ మహర్షి తపోభూమి..

శివ భక్తాగ్రేసురుడైన మార్కండేయ మహర్షి తపోభూమి.. శ్రీమహావిష్ణువు అనంత పద్మనాభస్వామిగా కొలువుదీరిన క్షేత్రమే అనంతగిరి. రాష్ట్ర రాజధానికి 75 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ ఆలయానికి ఎంతో చారిత్రక నేపథ్యం ఉంది. ఈ ఆలయం నిజాం నవాబుల పాలనలో వెలుగులోకి వచ్చింది. ఆలయం నుంచి కింద వైపుగా పుష్కరిణికి వెళ్లే మెట్ల మార్గంలోనే మార్కండేయ మహర్షి తపోభూమి దర్శనమిస్తుంది. అలాగే కింది భాగంలో మూసీనది ఉద్భవించిన భావనాశిని పుష్కరిణి, పురాతన శివాలయం ఉంది. భక్తుల కోరికలు తీర్చే అనంత వల్లభునిగా ఖ్యాతిగాంచిన పద్మనాభస్వామి దేవాలయం 13వ శతాబ్దం నాటిదనేది చరిత్రకారుల వాదన. ఔరంగజేబు కాలంలో గోల్కొండ నవాబు ఈ ఆలయాన్ని నిర్మించాడని పురాణాలు వివరిస్తున్నాయి. ఈ ఆలయ నిర్మాణంలో మహ్మదీయ శైలి కనిపిస్తుంది. గతంలో అనంతగిరి ప్రాంతమంతా దట్టమైన అడవులు, కొండలు, గుహలతో నెలకొని మునులకు నిలయంగా ఉండేదని ప్రతీతి. ముచుకుందుడు అనే రాజర్షి అనంతపద్మనాభస్వామి పాదాలు అభిషేకించిన స్థలంలోనే మూసీనది జన్మించిందనేది చరిత్ర కథనం.

పెరుగుతున్న పర్యాటకుల తాకిడి

అనంతగిరి కొండల్లోని ఆహ్లాదకరమైన వాతావరణం ఎవరినైనా ఇట్టే ఆకట్టుకుంటుంది. లోతైన లోయలు, వంపులు తిరిగిన రోడ్డు మలుపులు, పచ్చని చెట్ల సమూహాలతో అనంతగిరి కొండలు సందర్శకులకు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. సముద్ర మట్టానికి సుమారు రెండున్నర వేల అడుగుల ఎత్తులో ఉన్న ఈ కొండలు ఓ ప్రత్యేకతను సంతరించుకున్నాయి. ఇక్కడకు వచ్చే పర్యాటకుల సంఖ్య ఏటేటా పెరుగుతోంది. పర్యాటక శాఖ



ఆధ్వర్యంలో హరిత వ్యాలీ వ్యూ రిసార్ట్స్ నిర్మాణం చేపట్టారు. సందర్శకుల కోసం కాటేజీలు, స్విమ్మింగ్ పూల్‌ను నిర్మించారు. శుక్ర, శని, ఆదివారాల్లో ఈ రిసార్ట్స్ సందర్శకులతో కిటకిటలాడుతూ ఉంటుంది. పర్యాటకులు ఆన్‌లైన్‌లో గదులు రిజర్వు చేసుకుని ఇక్కడకు వస్తుంటారు.

బోటింగ్‌కు అడ్డా కోట్‌పల్లి

వికారాబాద్ జిల్లాలోనే అతి పెద్దది కోట్‌పల్లి ప్రాజెక్టు. 9,200 ఎకరాలకు పైగా ఆయకట్టు కలిగిన ఈ ప్రాజెక్టు ప్రముఖ సందర్శనీయ స్థలంగా పేరుగాంచింది. వర్షాకాలంలో ఇక్కడికి సందర్శకుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. ప్రాజెక్టు అందాలను తిలకించడానికే కాకుండా కుటుంబ సభ్యులతో ఆహ్లాదంగా గడపడానికి కూడా ఇక్కడికి చాలా మంది వస్తుంటారు. కోట్‌పల్లి ప్రాజెక్టులో కాయకింగ్ బోటింగ్ సౌకర్యం ఉండడంతో అనంతగిరికి వచ్చే పర్యటకులు కోట్‌పల్లికి వచ్చి బోటింగ్ చేస్తుంటారు. బోటింగ్ చార్జీలు రూ.300 నుంచి రూ.1000 వరకు ఉంది. అదే విధంగా పరిగి నియోజకవర్గంలోని లక్నాపూర్ ప్రాజెక్టు సైతం పర్యాటకులను కనువిందు చేస్తోంది.



రకరకాల పక్షులకు నెలవు

రంగారెడ్డి జిల్లా పరిధిలోని హిమాయత్ సాగర్, గండిపేట జలాశయాలు ప్రముఖ సందర్శనా స్థలాలుగా గుర్తింపు పొందాయి. రాష్ట్ర రాజధానికి కూతవేటు దూరంలో ఉన్న ఈ జలాశయాలకు నగరవాసులే కాకుండా ఉమ్మడి జిల్లా నుంచి వేలాది మంది సందర్శకులు నిత్యం వస్తుంటారు. సెలవుల్లో రోజంతా కుటుంబ సభ్యులతో కలిసి ఇక్కడే సరదాగా గడపడానికి ఆసక్తి కనబరుస్తారు. జలాశయాలకు వెళ్లే దారిలోనే ఉన్న ఔటర్ రింగ్ రోడ్డు కూడా కొత్తగా చూసేవారికి చక్కటి అనుభూతిని కలిగిస్తుంది. అలాగే జంటనగరాల నుంచి 44 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ చెరువు రకరకాల పక్షులకు నెలవుగా పేరుగాంచింది. ఇక్కడి చల్లటి వాతావరణం కారణంగా వేసవిలో సేదతీరడానికి పెద్ద సంఖ్యలో సందర్శకులు వస్తుంటారు. వారాంతంలో ఎంజాయ్ చేయడానికి నగరం నుంచి ఉద్యోగులు, యువత ఇక్కడికి వస్తుంటారు.



వికారాబాద్‌లో చూడదగ్గ ప్రదేశాలు

కుల్కచర్ల పాంబండ, కొడంగల్ శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయం, తాండూరులో భూకైలాస్, భద్రేశ్వర ఆలయం, జుంటుపల్లి సీతారాముల దేవాలయం, ఏకాంబరేశ్వరాలయం, పూడూరు దామంగం రామలింగేశ్వర స్వామి, పరిగి వేంకటేశ్వర స్వామి దేవాలయం, వికారాబాద్ శ్రీ బుగ్గరామలింగేశ్వర ఆలయాలు ఆధ్యాత్మిక నిలయాలుగా కొలువైనాయి. ఇక్కడ దైవ దర్శనంతో పాటు చుట్టురా ఉన్న ప్రదేశాలు భక్తులను, పర్యాటకులను ఎంతో ఆకట్టుకుంటున్నాయి.

స్వచ్ఛమైన తాగు నీటినందించాలి

- ప్రతీరోజు పరీక్షించిన తర్వాతే సరఫరా చేయాలి
- వాటర్‌మెన్లకు ఆర్‌డబ్ల్యూఎస్ సీఈ చంద్రమౌళి సూచన



మాట్లాడుతున్న చంద్రమౌళి

యాచారం, సెప్టెంబరు 26 : వాటర్‌మెన్‌లు ప్రతీరోజు ప్రజలకు స్వచ్ఛమైన నీరందించాలని, తాగునీటిని విధిగా పరీక్షించిన తర్వాతనే సరఫరా చేయలాని రంగారెడ్డి, వికారాబాద్, హైదరాబాద్ జిల్లాల ఆర్‌డబ్ల్యూఎస్ సీఈ చంద్రమౌళి సూచించారు. వాటర్‌మెన్ ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా ప్రజలు రోగాలబారిన పడతారని ఆయన తెలిపారు. మండల కేంద్రంలో వాటర్‌మెన్‌లకు తాగునీటి సరఫరాపై ఆర్‌డబ్ల్యూఎస్, మిషన్ భగీరథ అధికారులు ఇస్తున్న నాలుగు రోజుల శిక్షణ కార్యక్రమం గురువారం ముగిసింది. సీఈ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. వాటర్‌మ్యాన్ గ్రామానికి ఓ వైద్యుడి లాంటివారనే విషయం గమనంలో పెట్టుకోవాలని, ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకులను నిత్యం పరీక్షించుకోవాలని సూచించారు. ఆర్‌డబ్ల్యూఎస్ శాఖలో నిధుల కొరత లేదని, ప్రభుత్వం కొత్తగా ట్యాంకులు నిర్మించడంతో పాటు మరమ్మతులకు నిధులు కేటాయిస్తోందని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ఆంజనేయులు తెలిపారు. శిక్షణలో పాల్గొన్న వాటర్‌మెన్‌లకు సర్టిఫికెట్లను సీఈ, ఈఈ, ఎంపీడీవోలు అందజేశారు. ఈఈ రాజేశ్వర్‌రావు, డీఈ రాజు, ఎంపీడీవో నరేందర్‌రెడ్డి, ఏఈ సుభాష్, మిషన్‌భగీరథ ఏఈ ప్రణీత్ తదితరులు పాల్గొన్నారు.

బంకులో నీళ్లు కలిసిన పెట్రోల్

- వాహనదారుల అవస్థలు.. సిబ్బందిపై మండిపాటు



నీళ్లు కలిసిన పెట్రోల్ చూపిస్తున్న వాహనదారుడు

పెద్దేముల్, సెప్టెంబరు 26: ఎస్సార్ పెట్రోల్‌పంపులో కల్తీపెట్రోల్ కలకలం రేపింది. పెట్రోల్ పోయించుకున్న వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పెట్రోల్ పోయించుకున్న వాహనాలు కొద్దిదూరం వెళ్లగానే మొరాయించడంతో స్థానికంగా ఉన్న మెకానిక్‌లను ఆశ్రయించారు. మెకానిక్‌లు పరిశీలించి పెట్రోల్‌లో నీళ్లు కలవడంతోనే బండి మొరాయించిందని చెప్పడంతో వాహనదారులు ఆగ్రహానికి గురయ్యారు. పెద్దేముల్ మండలం కందనెల్లి గ్రామసమీపంలోని ఎస్సార్ పంపులో ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ ఘటనతో దిగివచ్చిన యాజమాన్యం వాహనదారులు ఎంత పెట్రోల్ వేయించుకున్నారో అంత డబ్బులు తిరిగి ఇప్పించారు. కాని నీళ్లు కలిసిన పెట్రోల్ వల్ల వాహనం ఇంజిన్ పాడైతే దానికి బాధ్యత తీసుకునేది ఎవరని వాహనదారులు ప్రశ్నించారు. దానికి పెట్రోల్ పంపు యాజమాన్యం నుంచి సమాధానం లేదని వాహనదారులు వాపోతున్నారు. విషయాన్ని పెద్దేముల్ మండల తహసీల్దార్‌కు ఫిర్యాదు చేయగా సివిల్ సప్లయి అధికారులకు ఫిర్యాదు చేయాలని సలహా ఇచ్చారని వాహనదారులు మండిపడ్డారు. ఈ విషయమై తహసీల్దార్‌ను వివరణ కోరగా కల్తీ పెట్రోల్‌పై తమకు ఫిర్యాదు వచ్చిందని, అయితే అది సివిల్ సప్లయి వారి బాధ్యత కాబట్టి వారికి ఫిర్యాదు చేయాలని వాహనదారులకు సూచించామని చెప్పారు. సివిల్ సప్లయి అధికారులు తమకు ఫిర్యాదు చేస్తే పెట్రోల్ పంపు యాజమాన్యంపై చర్యలు తీసుకుంటామన్నారు.



సిబ్బందిని నిలదీస్తున్న వాహనదారులు

రూ.6.5కోట్ల నిధులు వెనక్కి


మేడ్చల్‌లో నిలిచిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణ పనులు

ఇంటిగ్రేటెడ్ మార్కెట్, ధోబీ ఘాట్‌ల నిర్మాణాలకు శాశ్వత బ్రేక్

మేడ్చల్ టౌన్, సెప్టెంబరు 26: స్థానిక ప్రజల అవసరాలకు అనుగుణంగా మేడ్చల్ మున్సిపాలిటీలో గత ప్రభుత్వం తలపెట్టిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్, ధోబీ ఘాట్‌ల నిర్మాణాలకు శాశ్వతంగా బ్రేక్ పడింది. గత ప్రభుత్వం కేటాయించిన బడ్జెట్ నిధులను రద్దుచేస్తూ ప్రస్తుత ప్రభుత్వం కొత్తగా ఆదేశాలు జారీ చేయటంతో ఈ రెండు పనులు శాశ్వతంగా నిలిచిపోయాయి. 2021 వార్షిక బడ్జెట్‌లో గత బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టణ ప్రాంతాల్లో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ల నిర్మాణాలకు బడ్జెట్‌లో పెద్దఎత్తున నిధులు కేటాయించింది. అందులో భాగంగా మేడ్చల్ పట్టణానికి రూ.4.5కోట్లు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇందుకు పట్టణంలో ఆర్ అండ్ బీ భవన ప్రాంగణంలోని స్థలాన్ని ఎంపిక చేశారు. అయితే పరిస్థితులు అనుకూలించకపోవటంతో పట్టణంలోని కేఎల్ఆర్ ఫేస్-3 సమీపంలోని ప్రభుత్వ స్థలంలో మార్కెట్‌ను నిర్మించేందుకు ప్రతిపాదించారు. అనంతరం స్థానిక మున్సిపల్ అధికారులు మార్కెట్ నిర్మాణం చేపట్టడానికి టెండర్ కాల్ చేసి కాంట్రాక్టర్‌కు బాధ్యతలనూ అప్పగించారు. కాగా కాంట్రాక్టర్ పనులు ప్రారంభించినప్పటికీ నిధులు మాత్రం విడుదల కాలేదు. నిధులు కేటాయించే విషయంలో స్పష్టత లేకపోవటంతో కాంట్రాక్టర్ మధ్యలోనే పనులను నిలిపివేశాడు. అప్పటికే ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణానికి కాంట్రాక్టర్ దాదాపు రూ.50లక్షల వరకు ఖర్చుచేశాడు. టెండర్ కాల్‌చేసి నిర్మాణ బాధ్యతలు అప్పగించిన అధికారులను నిధుల గురించి అడిగినప్పటికీ వారి వద్ద నుంచి స్పష్టత లేకపోవటంతో కాంట్రాక్టర్ చేసిన పనులు బూడిదలో పోసిన పన్నీరులా మారింది. దీంతో సదరు కాంట్రాక్టర్ ఈ పనులకు శాశ్వతంగా నిలిపివేశాడు. తాను పెట్టిన డబ్బులు రాబట్టుకోవడానికి మేడ్చల్ మున్సిపల్ కార్యాలయం చుట్టూ చెప్పులు అరిగేలా తిరుగుతున్నాడు. అదేవిధంగా 2021లో ప్రభుత్వం మున్సిపల్‌లో ధోబీ ఘాట్ ఏర్పాటు చేయటానికి రూ.2 కోట్లు విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీచేసింది. ఈ నిర్మాణాన్ని పెద్ద చెరువు, తుమ్మ చెరువులో చేపట్టే విషయంలో స్థానిక ప్రజాప్రతినిధుల మధ్య ఏకాభిప్రాయం కుదరక కాలయాపన జరిగింది. చివరికి మేడ్చల్ పెద్ద చెరువులో నిర్మించాలని నిర్ణయించి టెండర్ వేశారు. పనులు చేపట్టడానికి ఒక కాంట్రాక్టరు ముందుకు వచ్చాడు. కాగా అప్పటికే ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులు చేపడుతున్న కాంట్రాక్టర్ పరిస్థితి చూసి ధోబీ ఘాట్ పని బాధ్యతలు చేపట్టిన కాంట్రాక్టర్ పనులు ప్రారంభించకుండా వదిలేశాడు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పెండింగ్ పనులను రద్దుచేస్తూ ఉత్తర్వులు జారీచేయటంతో ఈ పనులకు శాశ్వతంగా బ్రేక్ పడినట్లు అధికారులు తెలిపారు.

సమయస్ఫూర్తి వ్యవహరించని ప్రజాప్రతినిధులు

గత ప్రభుత్వ హయాంలో స్థానిక ఎమ్మెల్యే మల్లారెడ్డి రాష్ట్ర కేబినేట్‌లో కీలక మంత్రిగా ఉన్నారు. దీనికి తోడు స్థానిక ప్రజాప్రతినిధులు కూడా బీఆర్ఎస్ పార్టీకి చెందిన వారు ఉన్నారు. అయినప్పటికీ వారు మార్కెట్, ధోబీఘాట్ కోసం కేటాయించిన బడ్జెట్ నిధులను విడుదల చేయించలేకపోయారు. మంత్రి హోదాలో ఉన్న మల్లారెడ్డి కాస్త ఆసక్తి కనబరిచి వుంటే నేడు స్థానికంగా అభివృద్ధి పనులు జరిగేవని కొందరు స్థానిక నేతలు అంటున్నారు. స్థానిక ఎమ్మెల్యే మెతక వైఖరి వల్ల ఈ పరిస్థితి నెలకొందన్న విమర్శలు వినబడుతున్నాయి.

నిధులు వస్తే కదా



ప్రభుత్వం బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీచేసిన విషయం వాస్తవమే. అయితే ఈ కేటాయింపులు కేవలం కాగితాలకే పరిమితమయ్యాయి తప్ప నిధులు విడుదల చేయలేదు. దీంతో టెండర్లు వేసి కాంట్రాక్టర్లను కాల్‌ఫర్ చేశాం. కాగా కాంట్రాక్టర్లు పనులు ప్రారంభించలేదు. దీంతో పెండింగ్ పనులను ప్రభుత్వం పూర్తిగా రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

- నాగిరెడ్డి, మేడ్చల్ మున్సిపల్ కమిషనర్

పోలీసులు ప్రజల కోసమే పనిచేయాలి

మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి

మర్పల్లి, సెప్టెంబర్ 26: పోలీసులు ప్రజలకోసమే పనిచేయాలని, ప్రభుత్వం కోసం కాదని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు. మండల పరిధిలోని పట్లూర్ గ్రామానికి చెందిన నవీన్, ప్రవీన్ ఇద్దరు దళిత సోదరులను ఓ గుర్తుతెలియని వ్యక్తి మృతి కేసులో పోలీసుస్టేషన్‌కు తీసుకొచ్చి థర్డ్ డిగ్రీ ప్రయోగించి చిత్రహింసలు పెట్టారన్న విషయం తెలుసుకున్న ఆమె గురువారం బాధితులను మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్‌తో కలిసి పరామర్శించారు. సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాజీ మంత్రి మాట్లాడుతూ.. పట్లూర్ గ్రామంలో దొరికిన గుర్తుతెలియని మృతదేహం మీ పెద్దనాన్నదే అంటూ ఆధారాలు లేకుండా తీసుకెళ్లి చిత్రహింసలు పెట్టడం సరికాదన్నారు. ముందుగా లభ్యమైన మృతదేహం ఎవరిదో తెలుసుకొని చట్టప్రకారం వెళ్లాలని ఆమె సూచించారు. మృతదేహం ఎవరిదో తెలుసుకోవడంతో పాటు నవీన్ పెద్దనాన్న మిస్సింగ్ కేసును ఛేదించాలన్నారు. పోలీసులు, అధికారులు కొంత కాలం నుంచి బీఆర్ఎస్ కార్యకర్తల పట్ల, నాయకుల పట్ల దురుసుగా ప్రవర్తిస్తున్నారన్నారు. ఈ ఘటన పట్లూర్‌కే పరిమితం కాదన్నారు. బూచన్‌పల్లి, కొంశెట్‌పల్లి గ్రామాల్లోనూ బీఆర్ఎస్ నాయకుల పట్ల పోలీసులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారన్నారు. నిత్యం పోలీసులు ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆటో డ్రైవర్లు తమ దృష్టికి తీసుకొచ్చారన్నారు. న్యాయం కోసం పోలీస్‌స్టేషన్‌కు వస్తే అమానుషంగా చిత్రహింసలు పెట్టడం సరికాదన్నారు. మర్పల్లి మండలం చాలా వెనుకబడి ఉందని, పోలీసులు న్యాయం చేయకపోతే ఎక్కడికి వెళ్లి ఫిర్యాదు చేయాలో తెలియని పరిస్థితిలో ఇక్కడి ప్రజలు ఉంటారన్నారు.


బాధితులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి

ప్రభుత్వాలు శాశ్వతం కాదు

ప్రభుత్వాలు శాశ్వతం కాదని, ప్రభుత్వానికి అనుకూలంగా పనిచేస్తే సామాన్య ప్రజలకు ఎవరు న్యాయం చేస్తారని మాజీ మంత్రి సబితారెడ్డి అన్నారు. బాధితులకు అన్ని విధాలుగా అండగా ఉంటామని అన్నారు. పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని సూచించారు. ఇక్కడ పోలీసుల పని తీరుపై డీజీపీకి, వికారాబాద్ ఎస్పీకి ఫిర్యాదు చేస్తామన్నారు. అవసరమైతే ఐజీకి ఫిర్యాదు చేస్తామన్నారు. పూర్తి స్థాయిలో విచారణ చేపట్టేలా చూస్తామన్నారు. అదేవిధంగా రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు మధుకర్, మోహన్‌రెడ్డి, అశోక్, రాచన్న, మధుకర్ తదితరులు ఉన్నారు.

రాష్ట్రంలో ఆరాచక పాలన

నవాబుపేట: తెలంగాణ రాష్ట్రంలో ఆరాచక పాలన కొనసాగుతోందని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి ఆరోపించారు. మండల పరిధిలోని నారేగూడ గ్రామంలో రైతురుణమాఫీ కాని రైతులతో గురువారం ఆమె మాట్లాడారు. రుణమాఫీ అయ్యేంత వరకు బీఆర్ఎస్ పార్టీ పోరాటం చేస్తుందన్నారు. రైతు రుణమాఫీ కాలేదని ప్రజాభవన్‌కు ఫిర్యాదు చేసేందుకు వెళితే పోలీసులతో అరెస్టు చేయించడం ఎంతవరకు సమంజసమన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. ప్రజాభవన్‌కు వెళ్లి తమ గోడును తెలియజేసేందుకు ప్రయత్నించిన రైతులను పోలీసులు అరెస్టు చేయడం దారుణమన్నారు. రైతులతో బీఆర్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కేటీఆర్‌తో ఫోన్ ద్వారా మాట్లాడించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ రుణమాఫీ అయ్యేంత వరకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. సబితాఇంద్రారెడ్డి మాట్లాడుతూ గతంలో కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు వర్షాలుపడే సమయంలో రైతుబంధు ఒకేసారి ఖాతాల్లో జమ చేసేవారమని తెలిపారు. ప్రస్తుతం రుణమాఫీ చేయడంలో ఆధార్‌లో, బ్యాంకు ఖాతాల్లో తప్పులను సాకుగా చూపించడం ఎంత వరకు సమంజసమన్నారు. రూ.41లక్షల కోట్ల రుణమాఫీ కావాల్సి ఉందని చెబుతూ పూటకో మాట మార్చి రైతులను నట్టేటా ముంచారని ఆరోపించారు. ఎన్నికల్లో ఆరు గ్యారంటీలను అమలు చేసేంత వరకు ప్రజలకు బీఆర్ఎస్ అండగా ఉంటూ పోరాటం చేస్తుందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి బెదిరించి పాలన కొనసాగిస్తున్నారని విమర్శించారు. జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు మెతుకు ఆనంద్ మాట్లాడుతూ గ్రామంలో పదిహేను రోజులుగా విద్యుత్, మిషన్ భగీరథ తాగునీటి సరఫరా రావడంలేదన్నారు. దీన్నిబట్టి కాంగ్రెస్ పాలన ఏవిధంగా ఉందో ప్రజలకు అర్థమవుతోందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు భరత్‌రెడ్డి, అనంత్‌రెడ్డి, మహేశ్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, రైతులు కమాల్‌రెడ్డి, మల్లారెడ్డి, నాగిరెడ్డి, విఠలయ్య, రమేశ్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

గుర్రం దాడిలో వ్యక్తికి తీవ్ర గాయాలు


గుర్రం దాడిలో గాయలపాలైన గుడ్‌సాబ్

బషీరాబాద్, సెప్టెంబరు 26: ఓ వ్యక్తిపై ఒక్కసారిగా గుర్రం దాడికి దిగింది. అంతటితో ఆగకుండా నోటితో కొరికి బట్టలను ఊడదీసి పరుగులు పెట్టించింది. దీంతో సదరు వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన బషీరాబాద్ మండలం జీవన్గి శివారులో గురువారం వెలుగుచూసింది. బాధితుడి కుటుంబీకులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బషీరాబాద్ మండలం సరిహద్దు కర్ణాటక ప్రాంతంలోని జెట్టూరు గ్రామానికి చెందిన గుడ్‌సాబ్(23) ఒక గుర్రాన్ని పోషిస్తున్నాడు. ఏదైనా ఊరెళ్తే ఈ గుర్రంపైనే సవారీ చేస్తుంటాడు. కాగా గురువారం ఉదయం అతడి గుర్రం ఇంటి వద్ద నుంచి పారిపోయింది. ఈ క్రమంలో వెతుక్కుంటూ సమీప జీవన్గి గ్రామ శివారులోకి వచ్చాడు. అక్కడున్న అతడి గుర్రాన్ని పట్టుకునేందుకు వెళ్లగా అక్కడే పొదల్లో ఉన్న మరోగుర్రం పరుగెత్తుకొచ్చి దాడికి పాల్పడింది. అంతటితో ఆగకుండా వెంబడిస్తూ నోటితో కొరికి బట్టలను ఊడదీయగా గుడ్‌సాబ్ తీవ్రగాయాలపాలయ్యాడు. ఈ గుర్రం దాడిలో అతడి చేతివేలు తెగిపోయింది. ప్రాణ భయంతో పరుగులు తీస్తూ కిలోమీటరు దూరంలోని జీవన్గి ప్రధాన రోడ్డు వరకు వ్యవసాయ పొలాల బురదలోంచి, ఒంటిపై దుస్తులు లేకుండా పరిగెత్తుకొచ్చి ప్రాణపాయ స్థితినుంచి బయటపడ్డాడు. తీవ్రగాయాలతో ఉన్న అతన్ని స్థానికులు చూసి అతడి బావ హసన్‌ను పిలిపించి బాధితుడిని ఆటోలో ఎక్కించి తాండూరు జిల్లా ఆస్పత్రికి పంపించారు. అక్కడి వైద్యులు బాధితుడిని పరీక్షించి పరిస్థితి విషమంగా ఉందని, మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్ గాంధీ ఆస్పత్రికి రెఫర్ చేశారు.

పరిసరాల శుభ్రతకు పాటుపడాలి


విద్యార్థులు మానవహారం

శంకర్‌పల్లి, సెప్టెంబరు 26: పరిసరాల పరిశుభ్రతకు ప్రతీ ఒక్కరు పాటుపడాలని శంకర్‌పల్లి మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ తెలిపారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా గురువారం విద్యార్థులతో కలిసి శంకర్‌పల్లిలో మానవహారం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తడి, పొడి చెత్తను వేరుచేసి చెత్తబండిలో వేయాలని, ఎక్కడపడితే అక్కడ వేయరాదన్నారు. వైస్ చైర్మన్ వెంకట్‌రాంరెడ్డి, మేనేజర్ అంజన్‌కుమార్, నాయకులు ప్రవీణ్‌కుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆరు నెలల వరకూ తల్లిపాలు పట్టించాలి : సీడీపీవో


లేమూరు అంగన్‌వాడీ కేంద్రంలో తల్లులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న సీడీపీవో శాంతిశ్రీ, ఎంపీడీవో సరిత

కందుకూరు, సెప్టెంబరు 26: పుట్టిన బిడ్డకు ఆరు నెలల వరకూ తల్లి పాలను పట్టించాలని మహేశ్వరం సీడీపీవో శాంతిశ్రీ, ఎండీవో సరితలు సూచించారు. గురువారం మండలంలోని లేమూరు గ్రామంలో గల అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన పోషకాహార వారోత్సవాల్లో వారు పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా చిన్నారులకు అన్నప్రాసన చేయించారు. తల్లులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో లేమూరు వైద్యాధికారి స్వరూప, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

డీసీసీబీ డైరెక్టర్లుగా మొగులయ్య, కిషన్‌నాయక్

ఎస్సీ, ఎస్టీ కోటాలో ఏకగ్రీవం.. కొత్త డైరెక్టర్లకు ఘన సన్మానం


కొత్తగా డైరెక్టర్లుగా ఎన్నికైన మొగులయ్య, కిషన్ నాయక్‌లను సన్మానిస్తున్న డీసీసీబీ పాలకవర్గం

రంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 26 : జిల్లా కేంద్ర సహకార బ్యాంకు(డీసీసీబీ) కార్యవర్గ సమావేశాన్ని గురువారం నాంపల్లిలోని డీసీసీబీ కార్యాలయంలో నిర్వహించారు. ఎస్సీ ఎస్టీ కోటాలో కొత్తగా ఇద్దరు డైరెక్టర్లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కుల్కచర్ల పీఏసీఎస్ చైర్మన్ మొగులయ్య, మాజీ డీసీసీబీ డైరెక్టర్ కిషన్‌నాయక్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తీర్మానం చేసి ఆమోదించారు. కొత్తగా ఎన్నికైన డైరెక్టర్లను డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య, బ్యాంకు అధికారులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ సంగం రవీందర్‌గౌడ్, డైరెక్టర్లు అంజిరెడ్డి, చంద్రశేఖర్, బాల్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, పోలీస్ రాంరెడ్డి, బూర్కుంట సతీష్, పీజీవీ రాణి, సైదా పాల్గొన్నారు.

జిల్లా న్యాయమూర్తిని కలిసిన అటవీ శాఖ అధికారి



వికారాబాద్, సెప్టెంబరు 26: వికారాబాద్ జిల్లా న్యాయమూర్తి సున్నపు శ్రీనివాస్‌ను జిల్లా అటవీశాఖ అధికారి మర్యాద పూర్వకంగా కలిశారు. గురువారం న్యాయమూర్తి కార్యాలయంలో పుష్పగుచ్ఛం అందజేసి మర్యాద పూర్వకంగా కలిసి మాట్లాడారు.

కార్మికుల హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వాలు


సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్

ఆమనగల్లు, సెప్టెంబరు 26: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల హక్కులను కాలరాస్తూ శ్రమ దోపిడీకి గురిచేస్తున్నాయని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్ అన్నారు. కాంట్రాక్ట్ కార్మికులను క్రమబద్ధీకరించి పెరిగిన ధరలకనుగుణంగా వేతనాలు అందించాలని డిమాండ్ చేశారు. ఆమనగల్లు పట్టణంలో గురువారం ఆమనగల్లు ఏరియా కన్వీనర్ జె.పెంటయ్య అధ్యక్షతన నిర్వహించిన సీఐటీయూ సమావేశానికి భూపాల్, జిల్లా కార్యదర్శి చంద్రమోహన్, జిల్లా శ్రామిక మహిళా కన్వీనర్ జి. కవిత లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కార్మికుల సమస్యలపై చర్చించారు. కార్మికుల న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం 30న చలో హైదరాబాద్ లేబర్ కమిషనర్ కార్యాలయం ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు భూపాల్ తెలిపారు. కార్మికులు ఉప్పెనలా కదిలి రావాలని పిలుపునిచ్చారు. మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నిరుపేదలకు అండగా ఐక్యత ఫౌండేషన్


ఆర్థికసాయం అందిస్తున్న సుంకిరెడ్డి

ఆమనగల్లు, సెప్టెంబరు 26: నిరుపేద,నిరుద్యోగ యువతకు ఐక్యత ఫౌండేషన్ అండగా ఉంటుందని టాస్క్ సీవోవో, ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. వెల్దండ మండలం బండోనిపల్లికి చెందిన ఏకుల అర్జున్ కుటుంబం కొంతకాలంగా ఆర్థిక సమస్యలతో ఇబ్బంది పడుతోంది. ఐక్యత ఫౌండేషన్ ద్వారా అర్జున్ కుటుంబ జీవనోపాధి కల్పనకు గురువారం రూ.43 వేలు ఆర్థికసాయం అందజేశారు. యువత ఉద్యోగాల కోసం ఎదురుచూస్తూ వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఉపాధి పొందాలని సుంకిరెడ్డి సూచించారు. ఫౌండేషన్ సభ్యులు రవి, ఉపేందర్, నరేశ్, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీరాములు, అభినవ్‌రెడ్డి ఉన్నారు.

బేషరుతుగా పంటరుణం మాఫీ చేయాలి


నిరసనలో రైతు ఐక్యవేదిక నాయకులు, రైతులు

కేశంపేట, సెప్టెంబరు 26: రైతులు తీసుకున్న పంటరుణాలను బేషరుతుగా మాఫీ చేయాలని కేశంపేట రైతువేదిక నాయకుడు శివాజీ డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో శివాజీ ఆధ్వర్యంలో రుణాలు మాఫీ చేయాలని కోరుతూ ఒక్కరోజు నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రైతు రుణమాఫీపై పూటకోమాట చెబుతోందని, ప్రభుత్వం చెప్పిన గడువు ముగిసినా రైతులకు రుణమాఫీ కాలేదన్నారు. గ్రామాల్లో సగం మంది రైతులకే మాఫీ అయ్యిందని మిగతా వారు ఎదురుచూస్తున్నారని తెలిపారు. ఇప్పటి వరకూ రైతు భరోసా ఇవ్వలేదన్నారు. వర్షాలకు నష్టపోయిన పంటలకు పరిహారం చెల్లించాలని కోరారు. ఫసల్ బీమా యోజనను అమలు చేయాలని కోరారు. అనంతరం తహసీల్దార్ మీర్ అజంఅలీకి వినతిపత్రం అందించారు. మంచె ఈశ్వరయ్య, యాదయ్య, ప్రవీణ్, రాములు, మల్లేష్, అమ్రేష్, కిష్టయ్య, ప్రవీణ్‌రెడ్డి, శంకర్, రామ్, ఎండీ ఫరూఖ్ తదితరులు పాల్గొన్నారు.

దేశాభివృద్ధికి బీజేపీలో చేరండి : ఎంపీ అరుణ

షాద్‌నగర్ అర్బన్, సెప్టెంబరు 26: దేశ సమగ్రాభివృద్ధి కోసం ప్రతీ ఒక్కరు బీజేపీలో చేరాలని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ కోరారు. ఫరూఖ్‌నగర్ మండలంలోని అన్నారం, రాయికల్ గ్రామాలతో పాటు షాద్‌నగర్ పట్టణంలో నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమానికి గురువారం సాయంత్రం అరుణ పాల్గొన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీ అయిన బీజేపీ సభ్యత్వ కార్యక్రమం దేశవ్యాప్తంగా సజావుగా సాగుతున్నదని, మోదీ పాలనను చూస్తున్న మహిళలు సైతం స్వచ్ఛందగా బీజేపీ సభ్యత్వాన్ని తీసుకుంటున్నారని తెలిపారు. తెలంగాణలో సైతం అధికారమే లక్ష్యంగా సభ్యత్వాలు చేయించడానికి కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఎన్నికల్లో పోటీ చేయాలని భావించేవారు సభ్యత్వ కార్యక్రమాల్లో చురుకైన పాత్రను పోషించాలని అరుణ పిలుపునిచ్చారు. బీజేపీ నాయకులు బాబయ్య, విష్ణువర్ధన్‌రెడ్డి, చెంది మహేందర్‌రెడ్డి, వెంకటేష్ గుప్తా, పాతపల్లి కృష్ణారెడ్డి, కందూరు మనోహర్ రెడ్డి, మచ్చ సుధాకర్‌రావు, అమడాపురం నర్సింహాగౌడ్, విజయ్‌భాస్కర్, చెట్ల నర్సింహా, వంశీకృష్ణ, ఇస్నాతి శ్రీనివాస్, లక్ష్మీకాంత్‌రెడ్డి, మోహన్‌నాయక్, లష్కర్‌నాయక్, వెంకనోళ్ళ నర్సింహా తదితరులు పాల్గొన్నారు.


సభ్యత్వాన్ని ఇస్తున్న డీకె అరుణ

చదువుతో పాటు క్రీడల్లో ప్రతిభ చూపాలి

ఆదిభట్ల మున్సిపల్ చైర్మన్ నిరంజన్‌రెడ్డి


జోనల్ స్థాయి క్రీడల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులతో అతిథులు

ఇబ్రహీంపట్నం, సెప్టెంబరు 26: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో ప్రతిభ చూపాలని ఆదిభట్ల మున్సిపల్ చైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. ఇబ్రహీంపట్నంలోని గురుకుల విద్యాపీఠ్ హైస్కూల్‌లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన జోనల్ స్థాయి అండర్ 17, అండర్ 14 బాలురు/బాలికల కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ త్వరలోనే సొంత నిధులతో ప్రభుత్వ పాఠశాలలకు స్పోర్ట్స్ కిట్లు అందజేయనున్నట్లు ప్రకటించారు. ముగింపు టోర్నమెంట్‌లో ప్రతిభ కనబరిచి జిల్లాస్థాయిలో ఆడనున్న క్రీడాకారులకు ఏసీపీ కేపీవీ రాజు చేతులమీదుగా బహుమతులందజేశారు. పీఈటీల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బి.రాఘవరెడ్డి, జిల్లా అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, గురుకుల విద్యాపీఠ్ ప్రిన్సిపాల్ డి.శ్రీనివాస్‌రావు, స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు చెన్నకేశవరెడ్డి, జోనల్ సెక్రటరీ సుశీల తదితరులు పాల్గొన్నారు.

అసైన్డ్ భూముల్లో మట్టి తవ్వకాలపై విచారణ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

తాండూరు రూరల్ సెప్టెంబరు 26: మండలంలోని అంతారం అసైన్డ్ భూముల్లో అక్రమార్కులు భారీగా మట్టి తవ్వకాలు చేస్తున్నారని 'అసైన్డ్ భూముల్లో మట్టి తవ్వకాలు' అనే శీర్షికతో ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి రెవెన్యూ, మైన్స్ అధికారులు స్పందించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల రెవెన్యూ, మైన్స్ అధికారులు ఆర్ఐ గోపి, నిర్మల గురువారం క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు. సర్వే నెంబర్-58లో ఏ మేరకు తవ్వకాలు జరిపారు? అనుమతులు ఉన్నాయా? అనే దానిపై అక్కడ పనిచేస్తున్న సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అక్కడ తవ్వకాలు చేపట్టిన పెద్ద హిటాచీ ఉండటంతో రెవెన్యూ ఆర్ఐ గోపి, మైన్స్ ఆర్ఐ నిర్మల అధికారులకు సమాచారం ఇచ్చారు. అయితే వాటిని సీజ్ చేయాల్సి ఉండగా, కాంట్రాక్టర్లు రాజకీయ పలుకుబడి ఉపయోగించడంతో విచారణకు వెళ్లిన అధికారులు వెనుదిరిగి వెళ్లారు. అయితే అంతారం గ్రామస్తులు మాత్రం ఎంత మేరకు తవ్వకాలు జరిపారు? మైన్స్, రెవెన్యూ అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టారు? అనే విషయాలను తెలుసుకున్నారు. తవ్వకాలు జరిపిన వారికి చర్యలు చేపట్టి పెనాల్టీ వేయాల్సి ఉండగా, అధికారులు వెనుదిరిగి వెళ్లడంతో కాంట్రాక్టర్లపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని గ్రామస్తులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ఎర్రమట్టి అక్రమ తవ్వకాలు నిలిపివేయకపోతే పెద్దఎత్తున ధర్నా చేస్తామని హెచ్చరించారు.

రేవంత్‌రెడ్డిని దేవుడే చూసుకుంటాడు

- ఆయన అన్ని దేవుళ్ల మీద ఒట్లు వేసి మాట తప్పారు
- ప్రశ్నిస్తే పోలీస్ స్టేషన్లు.. గట్టిగా మాట్లాడితే దాడులు
- మంచిగా ఉన్న రాష్ట్రాన్ని విధ్వంసం చేస్తుండు
- హైడ్రా పేరుతో పేదల ఇళ్లు కూలుస్తుండు
- రైతు రుణమాఫీ అయ్యే వరకు బీఆర్ఎస్ పోరాటం ఆగదు
- మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి


నవాబుపేట మండలం నారేగూడ గ్రామంలో రైతులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి

వికారాబాద్/నవాబుపేట : రేవంత్‌రెడ్డిని దేవుడు చూసుకుంటాడని, ఆయన ఎన్నికల సమయంలో ప్రతీ ఒక్క దేవునిపై ఒట్లు వేసి మాట తప్పారని, చివరికి అనంతగిరి అనంతపద్మనాభ స్వామిపై కూడా ఒట్టు వేశారని ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి తెలిపారు. గురువారం వికారాబాద్ జిల్లా నవాబుపేట మండలం నారేగూడం గ్రామంలో మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్‌తో కలిసి పర్యటించారు. 15 రోజుల క్రితం బీఆర్ఎస్ పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు రైతు రుణమాఫీ చేయాలని నారేగూడం నుంచి హైదరాబాద్‌కు వస్తున్న రైతులను పోలీసులు అరెస్ట్ చేశారని, ఈ విషయం తెలుసుకొని మిమ్మల్ని కలవాలని వచ్చానని తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో కేసీఆర్ చినుకు పడితే చాలు రూ. 10 వేలు వేసే వారని, రేవంత్ రెడ్డి రైతు భరోసా పేరుతో రూ.15 వేలు వేస్తామంటే ప్రజలు, రైతులు నమ్మి ఓట్లు వేశారని తెలిపారు. కానీ రైతులకు ఆ పది వేలు కూడా వేయడం లేదని మండి పడ్డారు. రైతు భరోసా డబ్బులు కౌలు రైతుకు కూడా వేస్తామని నమ్మించి మోసం చేశారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి స్థాయిలో అసెంబ్లీ సాక్షిగా రైతు పండించిన ప్రతీ పంటకు రూ.500 బోనస్ ఇస్తామని చెప్పారని, ఇప్పుడు సన్నవడ్లు పండించిన వారికే అనడం దారుణమన్నారు. కేంద్రం నుంచి ఉపాధి హామీ పనుల డబ్బులు వస్తుంటే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాత్రం ఎగ్గొట్టే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఈ మధ్యనే కామారెడ్డి జిల్లాలో రైతులు రుణమాఫీ వివరాల కోసం బ్యాంక్ వద్దకు పోతే అరెస్ట్ చేశారని గుర్తు చేశారు. ఎక్కువ తక్కువ మాట్లాడితే కేసులు పెడుతామని పోలీసులు బెదిరించారని తెలిపారు. రాష్ట్రంలో ప్రభుత్వం బెదిరింపు పాలన సాగిస్తుందన్నారు. మహిళలకు 2500 పింఛన్లు, సబ్సిడీ గ్యాస్, ఉచిత కరెంటు ఇలా 420 మాటలు చెప్పి ఇప్పుడు ఏ ఒక్క హామీ నెరవేర్చడం లేదని తెలిపారు. మళ్లీ రాష్ట్రంలో ప్రజలు బీఆర్ఎస్ పాలనను కోరుకుంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఐలమ్మ పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలి


పరిగి: చాకలి ఐలమ్మకు నివాళులర్పిస్తున్న పరిగి మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి


తాండూరు: చాకలి ఐలమ్మకు నివాళులర్పిస్తున్న సబ్ కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్


కొడంగల్: మున్సిపల్ కార్యాలయంలో ఐలమ్మకు నివాళులర్పిస్తున్న చైర్మన్, అధికారులు

పరిగి, సెప్టెంబరు 26: తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, వీరనారి చాకలి ఐలమ్మ పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే, కె.మహేశ్‌రెడ్డి అన్నారు. చాకలి ఐలమ్మ 129వ జయంతి ఉత్సవాలు పరిగిలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ పార్టీలు, సంఘాల ఆధ్వర్యంలో వేర్వేరుగా ఐలమ్మ చిత్రపటానికి పూల మాలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం రాష్ట్ర కన్వీనర్ ఎం.లాల్‌కృష్ణప్రసాద్, డీసీసీ కార్యదర్శి కె.హన్మంత్‌ముదిరాజ్, నరేందర్ పాల్గొన్నారు.

కులకచర్ల: చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను రజక సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఎంపీడీవో కార్యాలయం ఎదుట గురువారం ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అంజనేయులు, కార్యదర్శి గోపాల్‌నాయక్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వ్యాసరచన పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందించారు.

తాండూరు: చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా రజకసంఘం ఆధ్వర్యంలో విజయ విద్యాలయ హైస్కూల్ సర్కిల్‌లో గురువారం ఆమె విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సబ్‌కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, ఆర్పీఎల్ సీఈవో శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న, మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

తాండూరు రూరల్: చెంగోల్‌లో చాకలి ఐలమ్మ జయంతిని పురస్కరించుకుని ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, మాజీ ఎంపీటీసీ వెంకటేశంగౌడ్, కాంగ్రెస్ నాయకులు రాము యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

యాలాల: మండలం కేంద్రంలో కేవీపీఎస్ నాయకులు చాకలి ఐలమ్మ జయంతిని ఘనంగా నిర్వహించారు. కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పలి మల్కయ్య మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

పెద్దేముల్: చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా మండలంలోని మంబాపూర్, గాజీపూర్ తదితర గ్రామాల్లో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి పలువురు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శ్రవణ్‌కుమార్, కార్యదర్శి సంజీవ్‌కుమార్ పాల్గొన్నారు.

కొడంగల్: చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా కొడంగల్ మున్సిపల్ కార్యాలయంలో గురువారం మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో అధికారులు ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ బలరాంనాయక్ పాల్గొన్నారు.

బొంరాస్‌పేట్: హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ లోని సీఎం నివాసంలో నిర్వహించిన ఐలమ్మ జయంతి కార్యక్రమంలో మండల నాయకులు జయకృష్ణ, వెంకట్రాములు, రాజేశ్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, మల్లికార్జున్, వెంకటయ్య పాల్గొన్నారు.

కొడంగల్ రూరల్: చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తితో మహిళలు ముందుకు సాగాలని ఎంపీడీవో ఉషశ్రీ అన్నారు. కొడంగల్‌లో చాకలి ఐలమ్మ జయంతిని పురస్కరించుకుని స్థానిక అంబేడ్కర్ చౌరస్తాలో గురువారం ఐలమ్మ చిత్రపటానికి మున్సిపల్ కమిషనర్ బలరాం నాయక్‌తో కలిసి పూలమాలలు వేశారు. అనంతరం కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ జిల్లా రజక సంఘాల ఉపాధ్యక్షుడు వెంకటయ్య, చంద్రప్ప, ముత్యప్ప పాల్గొన్నారు.

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో..


మేడ్చల్ టౌన్: గుండ్లపోచంపల్లిలో నివాళులర్పిస్తున్న రజక సంఘం నేతలు

మేడ్చల్ టౌన్: చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు గురువారం ఉమ్మడి మేడ్చల్ మండలంలోని రజక సంఘాల నాయకులు, రాజకీయ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గుండ్లపోచంపల్లి మున్సిపల్ పరిధిలోని ట్యాంక్‌బండ్, మేడ్చల్ పట్టణంలోని గ్రంథాలయం చౌరస్తా వద్ద ఉన్న చాకలి ఐలమ్మ విగ్రహాలకు స్థానికనేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కీసర: చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు కీసరలో ఘనంగా నిర్వహించారు. కీసర, చీర్యాల్, కరీంగూడ, తదితర గ్రామాలల్లో వీరనారి ఐలమ్మ విగ్రహానికి పూల మాలలు వేసి పలువురు నివాళులర్పించారు. అదే విధంగా తెలంగాణ ప్రభుత్వం కోఠి ఉమెన్స్ కళాశాలకు చాకలి ఐలమ్మ పేరు పెట్టినందుకు గానూ రజక సంఘాల నాయకులతో పాటు, పలువురు హర్షం వ్యక్తం చేశారు.

కీసర రూరల్: నాగారం మున్సిపాలిటీ రజక సంఘం ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె విగ్రహానికి నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ మల్లేష్‌యాదవ్, నాయకులు అన్నంరాజ్ శ్రీనివాస్, రాములు, సుధాకర్‌రెడ్డి, రజకసంఘం సభ్యులు పాల్గొన్నారు.

శామీర్‌పేట: చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా తూంకుంట మున్సిపల్‌లోని ఆమెవిగ్రహానికి మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి, మున్సిపల్ రజక సంఘం నాయకులు, మున్సిపల్ కౌన్సిలర్లు, వివిధ పార్టీల నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అదేవిధంగా శామీర్‌పేట మండలంలో చాకలి ఐలమ్మ చిత్రపటానికి వివిధ పార్టీల నాయకులు, రజకసంఘం నాయకులు, సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఘట్‌కేసర్ రూరల్: అవుషాపూర్‌లో చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి మాజీ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి కొండల్‌రెడ్డి, నాయకులు భిక్షపతిగౌడ్, మాజీ ఉపసర్పంచ్ అయిలయ్య యాదవ్, మశ్చేందర్‌రెడ్డి, సందీప్‌రెడ్డి, బొడిగె శ్రీనివాస్‌గౌడ్, మేడబోయిన జంగయ్య, వీరేషం, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

మూడుచింతలపల్లి: మండల కేంద్రంలో గురువారం మాజీసర్పంచ్ జామురవి ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికంగా ఉన్న కామిడి వీరారెడ్డి విగ్రహం వద్ద చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ వెంకటరమణరెడ్డి, మాజీ వార్డుసభ్యులు, నాయకులు పాల్గొన్నారు.


కీసర: చీర్యాల్ చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు నిర్వహిస్తున్న గ్రామస్థులు

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి


ఎమ్మెల్యేలను సన్మానిస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

వికారాబాద్, సెప్టెంబర్ 26: ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుందని, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్య వ్యవస్థను పటిష్టం చేసే దిశగా అడుగులు వేస్తుందని ఎమ్మెల్యేలు రాంమోహన్‌రెడ్డి, కాలేయాదయ్యలు అన్నారు. బుధవారం రాత్రి పీఆర్టీయూ నూతన జిల్లా కమిటీ ఏర్పాటు చేసి సర్వసభ్య సమావేశం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడిగా కడియాల చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శిగా అమర్నాథ్, గౌరవ అధ్యక్షులుగా వెంకట్రామిరెడ్డిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మాజీ అధ్యక్షుడు చెన్నకేశవరెడ్డి, ప్రధానపత్రిక సంపాదక వర్గసభ్యులు ఇన్నారెడ్డి పాల్గొన్నారు.

స్కూల్ గేమ్స్‌లో సత్తాచాటిన విద్యార్థులు


గెలుపొందిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

తాండూరు రూరల్ సెప్టెంబరు 26: ఎస్‌జీఎఫ్ స్కూల్ గేమ్స్‌లో తాండూరు మండలం కరన్‌కోట్ డీఏవీ స్కూల్ విద్యార్థులు సత్తాచాటారు. ఈనెల 25వ తేదీన బషీరాబాద్ పాఠశాలలో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-14 బాలుర విభాగంలో కబడ్డీ పోటీల్లో జరిగాయి. ఈ పోటీల్లో డీఏవీ సీసీఐ స్కూల్ విద్యార్థులు దుర్గేష్, ఇర్ఫాన్, అరుణ్ చౌహాన్, భద్ర మొదటి బహుమతి గెలుపొందారు. దీంతో అక్టోబర్‌లో జరిగే పోటీలకు డీఏవీ స్కూల్ విద్యార్థులు ఎంపిక కాగా పాఠశాల చైర్మన్ మహానా, ఏఆర్‌వో శేషాద్రి, ప్రిన్సిపాల్ ధరం సింగ్, ఏసురత్నం, పీఈటీ సహదేవ్ అభినందించారు.


పంట పొలాల పరిశీలన

బషీరాబాద్, సెప్టెంబర్ 26: మండలంలోని కుప్పన్‌కోట్ గ్రామ శివారులోని పంట పొలాలను జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రెడ్డి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడున్న ఏఈవో విజయ్‌తో క్రాప్ బుకింగ్‌కు సంబంధించి ఆరా తీశారు. అనంతరం కాశీంపూర్‌లోని ఫర్టిలైజర్ దుకాణాన్ని ఆయన పరిశీలించారు. ధరల పట్టిక, స్టాక్ రికార్డులు తనిఖీ చేస్తూ, ఏఏ ధరలకు ఏ మందులు విక్రయిస్తున్నారనే దానిపై అక్కడి యజమానితో వివరాలు అడిగితెలుసుకున్నారు. ఆయన వెంట బషీరాబాద్ ఏవో సూర్యప్రకాష్ ఉన్నారు.

పరిగి/దోమ: అధిక వర్షాల నేపథ్యంలో పంటలకు సోకే తెగుళ్ల నివారణకు రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని ఏరువాక కేంద్రం కో-ఆర్డినేటర్ టి.లక్ష్మణ్, శాస్త్రవేత్త సి.యమున సూచించారు. క్షేత్ర పర్యటనలో భాగంగా గురువారం పరిగి, దోమ మండలాల్లోని పలు గ్రామాల్లోని పంటలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పరిగి ఏడీఏ లక్ష్మీకుమారి, మండల వ్యవసాయ అధికారి రజిత, దోమ మండల వ్యవసాయ అధికారి ప్రభాకర్ రావు, విజయలక్ష్మి, బాబ్యానాయక్, శ్రవణ్‌కుమార్ పాల్గొన్నారు.

కీసర: రైతులు అధికారుల సలహాలు, సూచనలు పాటించాలని మండల వ్యవసాయ అధికారిణి మాధవీలత తెలిపారు. ఇటీవల కురిసిన వర్షాలకుగానూ మండల కేంద్రం కీసరలో గురువారం వరిపంటలను పరిశీలించారు.

సురక్షిత ప్రాంతాలకు తరలింపు


మూసీపరివాహక ప్రాంతాలను ఖాళీ చేస్తున్న అదనపు కలెక్టర్

మేడ్చల్, సెప్టెంబరు (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మూసీ పరివాహక ప్రాంత ప్రజలను అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి సురక్షిత ప్రాంతానికి తరలించారు. కొత్తపేట, భవాని నగర్‌లోని మూసీ ప్రాంతంలోని 11కుటుంబాలను ప్రభుత్వ ఖర్చులతో వనస్థలిపురం, ప్రతాప్‌సింగారం, తిమ్మాయిగూడలలోని డబుల్‌బెడ్ రూంల ఇళ్లకు తరలించారు. వారి సామగ్రిని సైతం సురక్షితంగా అప్పగించారు.

పరిసరాల పరిశుభ్రతపై దృష్టి సారించాలి


శామీర్‌పేట్: సమీక్షా సమావేశంలో జడ్పీ సీఈవో దిలీప్‌కుమార్, జిల్లా అధికారులు


ఘట్‌కేసర్: చెత్త తొలగిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావని

శామీర్‌పేట, సెప్టెంబరు 26: పరిసరాల పరిశుభ్రతపై దృష్టిసారించాలని జిల్లా పరిషత్ సీఈవో దిలీప్‌కుమార్ అన్నారు. శామీర్‌పేట మండల పరిషత్ కార్యాలయంలో గురువారం స్వచ్ఛతా హీ సేవ పక్షోత్సవంపై అధికారుల, పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈఓ, డీఆర్‌డీఓ పీడీ సాంబశివరావు, డీపీవో వెంకటయ్య, ఎంపీడీఓ మమతాబాయి పాల్గొన్నారు.

ఘట్‌కేసర్: మున్సిపాలిటీ పరిధిలోని పలుకాలనీల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్ కౌన్సిలర్లతో కలిసి స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలలో భాగంగా పాల్గొని వీధుల్లో చెత్తాచెదారాన్ని శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో వైస్‌చైర్మన్ పల్లుల మాధవరెడ్డి, కౌన్సిలర్లు శశికళ, మల్లేష్, రవీందర్, నాయకులు పాల్గొన్నారు. అదేవిధంగా పోచారం మున్సిపాలిటీ పరిధిలోని సంస్కృతి టౌన్‌షిప్‌లో గల ఆక్సిజన్ పార్కులో ఏర్పాటు చేసిన వసతులను మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వైస్‌చైర్మన్ నానావత్ రెడ్డియానాయక్, కౌన్సిలర్ హరి ప్రసాదరావు పాల్గొన్నారు.

ఘట్‌కేసర్ రూరల్: పరిసరాల పరిశుభ్రతపై ప్రతీఒక్కరు దృష్టి సారించాలని డీపీవో, మండల ప్రత్యేకాధికారి సాంబశివరావు తెలిపారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా ఆయన గురువారం ఎదులాబాద్ జిల్లా పరిషత్ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో గీతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తాండూరు రూరల్: మండలంలోని గౌతాపూర్ గ్రామపంచాయతీలో గురువారం స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో ఏ విధంగా కొనసాగుతుందనే విషయంపై జిల్లా స్వచ్ఛ భారత్ కో-ఆర్డినేటర్ కె.లక్ష్మి క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండల ఇన్‌చార్జీ పంచాయతీ అధికారి ఆనంద్‌రావు, పంచాయతీ కార్యదర్శులు లాలప్ప, వైద్య సిబ్బంది ప్రతినిధులు సుదర్శన్ పాల్గొన్నారు.

పాఠశాలల అభివృద్ధికి కృషి

మోమిన్‌పేట్, సెప్టెంబరు 26: పాఠశాలల అభివృద్ధికి కృషి చేస్తానని నూతన ఎంఈవో బి.మల్లేశం అన్నారు. మండల కేంద్రంలోని విద్యావనరుల కేంద్రంలో ఇన్‌చార్జి ఎంఈవో గోపాల్ నుంచి గురువారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మండలంలోని వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు ఎంఈవోను పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంఈవో గోపాల్, హెచ్‌ఎం గౌరీశంకర్, ఉపాధ్యాయులు అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

దోమ/బొంరాస్‌పేట్: దోమ మండల నూతన ఎంఈవోగా బాధ్యతలు స్వీకరించిన వెంకట్‌ను యూటీఎఫ్ నాయకులు సన్మానించారు. మండల కేంద్రంలో గురువారం యూటీఎఫ్ నాయకులు ఆయనను పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో వాసురాం, మల్లేశ్, రవికుమార్, రాములు, పాండురంగచారి, మేగ్యా, రాములు, రవి, అనంతయ్య పాల్గొన్నారు. అదే విధంగా కొడంగల్‌లోని దుద్యాల మండల నూతన ఎంఈవోగా బాధ్యతలు స్వీకరించిన విజయరామారావును యూటీఎఫ్ మండల అధ్యక్షుడు మల్లప్ప, ప్రధాన కార్యదర్శి కూర నర్సిములు, జిల్లా బాధ్యుడు మల్లేశం ఆధ్వర్యంలో సన్మానించారు. బొంరాస్‌పేట్ మండల నూతన ఎంఈవో నేనావత్ హరిలాల్‌ను తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం మండల అధ్యక్షుడు బాకారం చంద్రశేఖర్ ఆధ్వర్యంలో సన్మానించారు.

పూడూరు: పూడూరు మండల విద్యాధికారిగా నియమితులైన సాయిరెడ్డిని పీఆర్టీయూ నాయకులు సన్మానించారు. మండల పక్షాన అధ్యక్షులు శివకుమార్, ప్రధాన కార్యదర్శి ప్రవీణ్‌కుమార్, సంఘ బాధ్యులు గురువారం ఎంఈవోకు స్వాగతం పలికి సన్మానించారు.

సంక్షిప్తంగా..

● **ధారూరు:** ధారూరు అటవీ సెక్షన్ పరిధిలోని రాంపూర్ తండా సమీపంలోని కంపార్టుమెంట్ 97 వద్ద అడవి చుట్టు తీసిన కాలువను పూడ్చివేసి, వెదురు చెట్లను ధ్వంసం చేసి పొలానికి దారి చేసుకున్న వ్యక్తిపై ధారూరు డీఎఫ్ఆర్‌వో హేమ గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వేణుగోపాల్ గౌడ్ తెలిపారు.

● **బొంరాస్‌పేట్:** బాపల్లితండా పరిధిలోని పాలబాయి తండాకు చెందిన శ్రీనునాయక్‌కు సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేశారు. కాంగ్రెస్ కొడంగల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి ఆదేశానుసారం గురువారం కాంగ్రెస్ నాయకులు మోత్యానాయక్, మహేందర్‌సింగ్, దాన్యనాయక్, గంగ్యానాయక్, హనుమంతునాయక్ చేతుల మీదుగా రూ.లక్షా 25వేల చెక్కును అందజేశారు.

● **బొంరాస్‌పేట్:** గత ప్రభుత్వ హయాంలో విడుదల చేసిన జీవో నెంబర్ 81, 85 ద్వారా 61సంవత్సరాలు పైబడిన వీఆర్ఏల వారసులకు త్వరగా నియామక ఉత్తర్వులు అందజేయాలని రాంచంద్రయ్య, రాములు, వెంకటయ్య, మొగులయ్య, లక్ష్మి, మల్లయ్య, హనుమంతు, చంద్రయ్య, ప్రభాకర్, శ్రీకాంత్, తిరుపతి, రమేశ్ కోరారు. తహసీల్దార్ పద్మావతికి గురువారం వారు వినతి పత్రం అందజేశారు.

● **ఘట్‌కేసర్ రూరల్:** మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల 200మంది విద్యార్థులకు సొంత డబ్బులు చెల్లించి బస్‌పాస్‌లను అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ పన్నాల కొండల్‌రెడ్డి గురువారం అందజేశారు.

● **వికారాబాద్:** వాహనదారులు ప్రతీ ఒక్కరు ట్రాఫిక్ రూల్స్ పై అవగాహన కలిగి ఉండాలని ఎస్‌ఐ శ్రీనివాస్ సూచించారు. వికారాబాద్‌ని ఎన్టీఆర్ చౌరస్తాలో గురువారంవాహన దారులకు ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పించారు.

● **తాండూరు:** రాష్ట్రంలో స్కూల్ అకాడమిక్‌లో ఉత్తమ సేవలు అందిస్తున్న పాఠశాలలకు ప్రతీసంవత్సరం న్యూస్ ప్రైవేటు నెట్‌వర్క్ సంస్థ అవార్డులు అందిస్తోంది. ఇందులో భాగంగా 2024 డైనమిక్ స్కూల్ అవార్డు తాండూరు అల్మాస్ ఇంటర్నేషనల్ స్కూల్‌కు వరించింది. ఈ అవార్డును స్కూల్ హెచ్‌ఎం అబ్దుల్ గఫార్‌కు, అల్మాస్ గ్రూప్ ఇన్‌స్టిట్యూట్ వ్యవస్థాపకులు ప్యాటరన్ అల్మాస్ తాహెర్ ఖురేషీకి అందజేశారు.

● **కులకచర్ల:** సైబర్ నేరాల పట్ల ఖాతాదారులు అప్రమత్తంగా ఉండాలని ఎస్బీఐ ఆర్‌ఎం పల్లంరాజు తెలిపారు. స్థానిక ఎస్బీఐని గురువారం ఆయన సందర్శించారు. పలు రికార్డులను పరిశీలించారు.

● **ధారూరు:** మండలంలో పంచాయతీల వారీగా ఉపాధిహామీ పనుల తనిఖీలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో నర్సింహులు తెలిపారు. మండల పరిషత్తు కార్యాలయంలో గురువారం మండల స్థాయి కో ఆర్డినేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15వ విడత ఉపాధి హామీ పనులను సామాజిక తనిఖీ బృందాలు తనిఖీలు చేస్తాయని ఆయన చెప్పారు. ఈ సమావేశంలో సామాజిక తనిఖీ రాష్ట్ర రిసోర్స్ పర్సన్ గంగరాజు, ఈజీఎస్ ఏపీవో సురేష్, ఈసీ రమేశ్, టెక్నికల్ అసిస్టెంట్‌లు, ఫీల్డ్‌అసిస్టెంట్స్, పంచాయతీ కార్యాదర్శులు పాల్గొన్నారు.

● **మోమిన్‌పేట్:** 15వ విడత సామాజిక తనిఖీలో భాగంగా గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో డీఆర్‌డీ వో పీడీ శ్రీనివాస్ మాట్లాడారు. కూలీ రైతులకు సరైన పనులు కల్పించి ఆసరాగా ఉండాలని ఉపాధిహామీ సిబ్బందిని ఆదేశించారు. ఈ నెల 18 నుంచి 25 వరకు గ్రామాల్లో సామాజిక తనిఖీ బృందం నివేదికలను అందించారు.

● **పరిగి:** మహిళలు అన్ని రంగాల్లో రాణించేలా తమ సంఘం చేయూతను అందిస్తున్న ఐదవవార్డు సిద్ధాంతికాలనీ మహిళా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పి.అనురాధ, అనమోని లక్ష్మి అన్నారు. గురువారం తమ కాలనీలో సంఘం కోసం కొత్తగా కార్యాలయాన్ని ప్రారంభించారు. నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

● **కీసర:** కీసర పరిధిలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని కీసర మాజీ ఉపసర్పంచ్ తటాకం లక్ష్మణ్ శర్మ ఆరోపించారు. కీసరలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. కీసర దార సర్వే నంబర్ 196, 198/2, 3లో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని 23-03-2024 రోజున కీసర పంచాయతీ కార్యదర్శి గంగన్నకు చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

● **మేడ్చల్ టౌన్:** ప్రతీ ఇంటి గుమ్మం తట్టి సభ్యత్వం చేయించాలని బీజేపీ మేడ్చల్ నియోజకవర్గం కన్వీనర్ అమరం మోహన్ రెడ్డి అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో గురువారం బీజేపీ నాయకులు పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు.

● **మేడ్చల్ టౌన్:** మేడ్చల్ పారిశ్రామిక శిక్షణ కేంద్రంలో వెల్డర్, డీజిల్ మెకానిక్ కోర్సుల్లో ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేయటాకి ఈ నెల 28న ఉదయం 10 గంటలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నామని ప్రిన్సిపాల్ హనుమాన్ నాయక్ తెలిపారు. 10వ తరగతి ఉత్తీర్ణులై 14 సంవత్సరాలకు పైబడి ఉన్న విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని ఇంటర్వ్యూకు హాజరు కావాలని ఈ సందర్భంగా సూచించారు.

క్రైం కార్నర్

లారీ ఢీకొని యువకుడి మృతి

● ఇద్దరికి స్వల్ప గాయాలు

కీసర రూరల్, సెప్టెంబరు 26: లారీ ఢీకొని ఒకరు మృతి చెందగా మరో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన గురువారం కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ వెంకటయ్య తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఛత్తీస్‌ఘడ్‌కు చెందిన రామాయన్‌దాస్(31), రాంకుమార్, రూపేష్‌లు నాగారం మున్సిపాలిటీలో నివాసముంటున్నారు. వీరు ముగ్గురూ మిత్రులు. కూలి పనిచేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నారు. కాగా ఈ ముగ్గురు చేపలు పట్టేందుకు కీసర మండల పరిధి చీర్యాల గ్రామంలోని చెరువుకు తమ పల్సర్ బైక్‌పై బయల్దేరారు. ఈ క్రమంలో చీర్యాల చౌరస్తా సమీపంలోని జయమోహన్‌గార్డెన్ ఫంక్షన్‌హాల్ వద్దకు చేరుకున్నారు. మూల మలుపు వద్ద బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. బైక్ నడుపుతున్న రామాయాన్‌దాస్ కీసర నుంచి ఈసీఐఎల్ దిశగా ప్రయాణిస్తున్న లారీ వెనక చక్రాల కిందపడి తీవ్రగాయాలపాలయ్యాడు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనాస్థలానికి చేరుకుని క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. తీవ్రగాయాలైన రామాయన్‌దాస్ చికిత్స పొందుతూ మృతి చెందాడు. రాంకుమార్, రూపేష్‌లకు స్వల్పగాయాలయ్యాయి. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి..


బొల్లంరాజు(ఫైల్)

దోమ, సెప్టెంబరు 26: విద్యుదాఘాతంతో ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన దోమ మండలంలో బుధవారం రాత్రి జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని దిర్సంపల్లికి చెందిన బొల్లంరాజు(28) తన పొలం దగ్గర విద్యుత్ విద్యుత్ మరమ్మతులు చేస్తుండగా ఒక్కసారిగా విద్యుదాఘాతానికి గురయ్యాడు. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే హుటాహుటిన ఆయన్ను పరిగి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినప్పటికీ అక్కడి వైద్యులు వికారాబాద్ ఆసుపత్రికి తరలించడంతో అప్పటికే మృతి చెందాడని నిర్ధారించారు. మృతుడికి భార్య రాణి ఉన్నారు. ఉన్న ఒక్కగానొక్క కుమారుడి మృతితో బాధిత కుటుంబం కన్నీరుమున్నీరయ్యారు.

అనుమానాస్పద స్థితిలో మరొకరు..


ఎండీ నిజామ్(ఫైల్)

పరిగి, సెప్టెంబరు 26: అనుమానస్పదస్థితిలో ఓ వ్యక్తి మృతిచెందాడు. వివరాల్లోకి వెళితే.. పరిగి మండలం రాఘవాపూర్ గ్రామానికి చెందిన ఎండీ నిజామ్(48) గ్రామంలోని ఇంట్లో ఒక్కడే నివాసముంటున్నాడు. గత సోమవారం నుంచి నిజామ్ కనిపించడం లేదు. గురువారం గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు చెరువు దగ్గరకు వెళ్లగా కట్టపై దుస్తులు కనిపించాయి. ఈ దుస్తులు గమనించి నిజామ్‌కు చెందినవిగా గుర్తించి పరిసరాల్లో పరిశీలించగా నీటిలో మృతదేహం లభ్యమైంది. ఈ విషయాన్ని మృతుడి అన్న జహంగీర్‌కు తెలిపారు. కుటుంబ సభ్యులు వెళ్లి చూసి నిజామ్ మృతదేహంగా గుర్తించారు. రెండు, మూడు రోజుల క్రితమే మృతి చెంది ఉంటాడని స్థానికులు భావిస్తున్నారు. మృతుడి అన్న జహంగీర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, పరిగి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహన్ని పరిగి ఆస్పత్రిలోని మార్చురీకి తరలించారు. తన తమ్ముడి మృతి పట్ల కొందరిపై అనుమానం ఉందని మృతుడి అన్న జహంగీర్ ఆరోపిస్తున్నాడు.

మున్సిపల్ సిబ్బందిపై వైస్‌చైర్మన్ తనయుడి దుర్భాషలు

మేడ్చల్ టౌన్, సెప్టెంబరు 26: మున్సిపల్‌లో ఎలక్ట్రీషన్‌గా పని చేస్తున్న కార్మికుడిపై స్థానిక మున్సిపల్ వైస్‌చైర్మన్ తనయుడు దుర్భాషలాడిన ఘటన స్థానికంగా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఫోన్‌లో ఇరువురి మధ్య జరిగిన సంభాషణ స్థానిక సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావటంతో విషయం బయటపడింది. వివరాలిలా ఉన్నాయి.. మేడ్చల్ మున్సిపల్ వైస్‌చైర్మన్ రమేష్ మంగళవారం రాత్రి తన వార్డులోని సాయిబాబా కాలనీలో వీధిదీపాలు సరిగా రాకపోవటంతో వాటిని వెంటనే మరమ్మతు చేయాలని మున్సిపల్ ఎలక్ట్రీషియన్ రఫీక్‌ను కోరారు. దీంతో ఎలక్ట్రీషన్ విద్యుత్ దీపాలను మరమ్మతు చేసి వెళ్లగా విద్యుత్ దీపాలు రావడం లేదని కాలనీ వాసులు తిరిగి వైస్‌చైర్మన్ రమేష్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో రమేష్ ఎలక్ట్రీషియన్‌కు ఫోన్‌చేసి మరమ్మతులు చేయలేదంటూ మండిపడ్డారు. ఈక్రమంలో వైస్‌చైర్మన్‌కు ఎలక్ట్రీషన్‌కు మధ్య వాగ్వివాదం జరిగింది. అనంతరం కాసేపటికే వైస్‌చైర్మన్ రమేష్ తనయుడు ఆకాష్ ఎలక్ట్రీషియన్ రఫీక్‌కు ఫోన్‌చేసి తన తండ్రితో దురుసుగా ప్రవర్తించినందుకు వెంటనే వచ్చి క్షమాపణ చెప్పాలని కోరాడు. ఈ క్రమంలో ఇరువురు ఫోన్‌లో దుర్భాషలాడారు. దీంతో బుధవారం సాయంత్రం మున్సిపల్ ఎలక్ట్రీషియన్లు అందరు కలిసి నిరసనగా పట్టణంలో రెండు గంటల పాటు, సాయిబాబా కాలనీలో మొత్తం విద్యుద్దీపాలు ఆఫ్ చేసి ఎలక్ట్రీషియన్‌కు, వెస్‌చైర్మన్ తనయుడు ఆకాష్‌కు మధ్య జరిగిన సంభాషణను సామాజిక మాధ్యమాల్లో వైరల్ పోస్ట్ చేసి నిరసన తెలిపారు. విషయం తెలుసుకున్న చైర్పర్సన్ విచారణ జరుపుతామని హామీ ఇవ్వడంతో వారు నిరసనను విరమించారు. ఈ విషయమై వైస్‌చైర్మన్ రమేష్‌ను వివరణ కోరగా తనపై కక్షసాధింపు చర్యకు పాల్పడుతున్నారని తెలిపారు. తప్పతాగి తనతో ఎలక్ట్రీషియన్ మాట్లాడిన మాటలు కాకుండా, కేవలం తన మాటలను రికార్డు చేసి సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేయడం కుట్రగా భావిస్తున్నట్లు తెలిపారు. నిజానిజాలు తెలుసుకోకుండా స్థానికులను రెండు గంటల పాటు చీకటిలో ఉంచడం దురదృష్టకరమని తెలిపారు. ఈ విషయం పట్ల మున్సిపల్ కమిషనర్ తన కార్యాలయంలో గురువారం విచారణ జరిపి ఇరువురిని సముదాయించారు.

అటవీభూముల ఆక్రమణలపై అధికారుల సీరియస్

● 15 మంది గిరిజనులపై కేసులు నమోదు


నీళ్లపల్లి-మైల్వార్ రిజర్వ్ ఫారెస్ట్‌లో ఆక్రమణలను పరిశీలిస్తున్న రేంజర్ రాజేందర్

బషీరాబాద్, సెప్టెంబరు 26: అటవీ భూముల ఆక్రమణలపై తాండూరు ఫారెస్ట్ రేంజ్ అధికారులు సీరియస్‌గా స్పందించారు. అటవీ భూముల్లో చెట్లను నరికి సాగుకు యత్నిస్తున్నా 15 మంది గిరిజనులపై గురువారం పోలీస్ కేసుపెట్టారు. మండలంలోని నీళ్లపల్లి- మైల్వార్ రిజర్వ్ ఫారెస్ట్‌లో గత నాలుగైదు రోజులుగా సర్వేనెంబర్ 218 లోని మైల్వార్‌తండా అటవీ ప్రాంతంలో స్థానిక గిరిజనులు రాత్రుల్లో చెట్లను నరికి యాసంగి పంట సాగుకు యత్నిస్తున్నారు. ఫారెస్ట్ రేంజర్ రాజేందర్ ఆదేశానుసారం సెక్షన్ అధికారులు స్నేహ, పీర్యానాయక్, బీట్ ఆఫీసర్లు, సిబ్బందితో కలిసి వెళ్లి అడ్డుకుంటున్నా లెక్కచేయడంలేదు. ఈ క్రమంలో రేంజర్ గురువారం సెక్షన్ బీట్ అధికారులతో కలిసి అటవీ ప్రాంతంలో చెట్లను నరికి సాగుకు యత్నిస్తున్నా ప్రాంతాన్ని కలియతిరిగి పరిశీలించారు. పలుచోట్ల చెట్లను నరికివేయడాన్ని గుర్తించిన రేంజర్ వెంటనే ఆక్రమణకు యత్నించిన వారిని గుర్తించాలని సిబ్బందికి ఆదేశించారు. మైల్వార్‌తండా, క్షేత్ర స్థాయిలో విచారణ చేపట్టిన ఆ శాఖ అధికారులు 15 మంది గిరిజనులు ఉద్దేశ పూర్వకంగా చెట్లను నరికి అక్రమంగా భూములను సాగు చేసుకునేందుకు బషీరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనంతరం తహసీల్దార్ వై.వెంకటేష్‌ను తాండూరు ఫారెస్ట్ రేంజర్ రాజేందర్ కలిసి హద్దుల వివరాలను అడిగి తెలుసుకున్నారు.

కరన్‌కోట్ పోలీస్‌స్టేషన్‌కు అవార్డు

● టాప్-10 జాబితాలో చోటు ● పౌరుల అభిప్రాయ సేకరణలో టాప్


కరన్‌కోట్ ఎస్ఐకి ప్రశంసాపత్రం అందజేస్తున్న డీజీపీ

తాండూరు రూరల్, సెప్టెంబరు 26: సిటిజెన్ ఫీడ్‌బ్యాక్ సెంటర్ నుంచి వచ్చిన పౌరుల అభిప్రాయాల ఆధారంగా తెలంగాణ పోలీసుశాఖ ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారికి ప్రశంసాపత్రాలను అందజేసింది. అందులో వికారాబాద్ జిల్లా తాండూరు మండలం కరన్‌కోట్ పోలీసు స్టేషన్ టాప్-10 జాబితాలో నిలిచింది. దీంతో తెలంగాణ డీజీపీ డాక్టర్ జితేందర్ కరన్‌కోట్ ఎస్ఐ వి.విఠల్‌రెడ్డికి ప్రశంసాపత్రాన్ని అందజేశారు. సిటిజెన్ ఫీడ్‌బ్యాక్ సెంటర్, పోలీసుల సామర్థ్యం, జవాబుదారీతనం మెరుగు పర్చడంలో కీలకపాత్ర పోషించింది. ఆటోమెటిక్ కాలింగ్‌యాప్ ద్వారా పిటిషన్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ వెరిఫాస్ట్ డేటా, ఈ-చాలాన్ డేటా, ఎఫ్ఐఆర్ డేటా వంటి వివిధ అంశాల్లో పోలీసుసేవలతో సంరక్షణ చేసి పౌరుల నుంచి ప్రత్యేక బృందం అభిప్రాయాన్ని సేకరించింది. అందులో భాగంగా కరన్‌కోట్ పోలీసు స్టేషన్‌లో టాప్-10జాబితాలో నిలవడంతో ఈ అవార్డును అందుకుంది. ఈ సందర్భంగా ఎస్ఐ విఠల్‌రెడ్డి మాట్లాడుతూ ఈ అవార్డును తన బాధ్యతను మరింత పెంచిందన్నారు.